

ఓట్ల కోసం కాదు... ప్రజల కోసమే మా పథకాలు

● 'అన్బుకరంగళ్' ప్రారంభోత్సవ సభలో సీఎం స్టాలిన్



బాలుడికి 'అన్బుకరంగళ్' గుర్తింపు కార్డు అందజేస్తున్న ముఖ్యమంత్రి

చెన్నై, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ద్రావిడ తరహా డీఎంకే ప్రభుత్వం ఓట్ల కోసం పథకాలను అమలు చేయడం లేదని, అన్ని వర్గాలవారు అన్ని సదుపాయాలు పొందాలనే లక్ష్యంతోనే కొత్త పథకాలను అమలు చేస్తోందని ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ పేర్కొన్నారు. చేపాక్ కలైవానర్ అరంగంలో సామాజిక సంక్షేమం, మహిళా సాధికార శాఖల ఆధ్వర్యంలో సోమవారం 'అన్బుకరంగళ్' అనే కొత్త పథకాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటైన సభలో సీఎం మాట్లాడుతూ.. డీఎంకే వ్యవస్థాపకుడు, మాజీ ముఖ్యమంత్రి దివంగత అన్నాదురై జయంతి సందర్భంగా చిన్నారుల కోసం అన్బుకరంగళ్ పథకాన్ని ప్రారంభించడం తనకెంతో సంతోషంగా ఉందన్నారు. 'పేదల చిరునవ్వుల్లోనే దేవుడిని చూడగలం' అని అన్నాదురై చెబుతుండేవారని, అలాంటి నిరుపేద కుటుంబాల్లో కాసింత చిరునవ్వును తెప్పించడం కోసమే ఈ పథకాన్ని రూపొందించామని, జిల్లా కలెక్టర్లందరూ శ్రమించి అర్హుల వివరాలు సేకరించి 6082 మంది లబ్ధిదారులను ఎంపిక చేశారని చెప్పారు. తానెప్పుడూ సీఎం పదవిని ప్రజలు అప్పగించిన బాధ్యతగానే భావిస్తానన్నారు. కానీ ఇతరులు మాత్రం ఆ పదవిని తమ విలాసాల కోసం వాడుకుని, ప్రజా సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించి, ఎన్నికల సమయంలో ఒకటీరెండు ఆకర్షణీయమైన హామీలు ప్రకటించి మళ్ళీ అధికారంలోకి రావాలని తాపత్రయపడుతుంటారని విమర్శించారు.

కార్యక్రమంలో భాగంగా తల్లిదండ్రులను కోల్పోయిన, తల్లిదండ్రుల్లో ఒకరిని కోల్పోయి, ఆర్థికస్థితి లేని తల్లి లేదా తండ్రి సంరక్షణలో ఉన్న చిన్నారులను 18 యేళ్ల వరకు చదివించేందుకు ప్రతినెలా రూ.2000 చెల్లించే ప్రస్తుతం అమలులో ఉన్న 'తాయుమానవర్ పథకం'తో పాటు ఈ కొత్త పథకానికి శ్రీకారం చుట్టి, కొంతమంది చిన్నారులకు ఆయన రూ.2వేల చెక్కులను అందజేశారు. ఇదే విధంగా తల్లిదండ్రులను కోల్పోయి ప్లస్-2 (12వ తరగతి) ఉత్తీర్ణులై ఉన్నత విద్య చదువుతున్న 1340 మంది విద్యార్థులకు ఉచితంగా లాప్‌టాప్‌లను స్టాలిన్ అందజేశారు. డీఎంకే ప్రభుత్వం ఓట్ల కోసం పథకాలను అమలు చేయదని, ప్రజల దీర్ఘకాలిక ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకునే ప్రతిపథకాన్ని ఆచితూచి అమలు చేస్తుందన్నారు. ఆర్థికంగా వెనుబడిన హిజ్రాల బ్రతుకులో వెలుగు నింపే పథకాలను అమలు చేశామని,




'తాయుమానవర్' పథకం కింద విద్యార్థికి లాప్‌టాప్ అందజేస్తున్న ముఖ్యమంత్రి స్టాలిన్

ఇక మహిళలు ఆర్థికపరంగా ఉన్నతస్థితికి చేర్చాలనే సత్సంకల్పంతోనే కలైంజర్ మహిళా సాధికారిక పథకం క్రింద అర్హులైన గృహిణులకు ప్రతినెలా రూ.1000లు వారి బ్యాంక్ ఖాతాల్లోనే జమ చేస్తున్నామని గుర్తు చేశారు. రాబోవు ఎన్నికల్లో మళ్ళీ అధికారంలోకి రావాలనే ఆశతో తమ ప్రభుత్వం ఇలాంటి పథకాలను అమలు చేయడం లేదని, అందరికీ అన్ని సదుపాయాలు అనే ఏకైక లక్ష్యాన్ని సాధించడం కోసమే అమలు చేస్తున్నామని చెప్పారు. ఎన్నికల్లో ఓట్లు తమ ప్రభుత్వంపై, తనపైనా ప్రజలకున్న నమ్మకాన్ని తెలియజేస్తాయన్నారు. అన్బుకరంగళ్ పథకం లబ్ధిదారులు ఉన్నత చదువుల్లోనూ రాణించి ఐపీఎస్, ఐఏఎస్ అధికారులుగా రాష్ట్రానికి సేవలందించాలని ఆశపడుతున్నానని, ఆ ఆశను బాలబాలికలు నెరవేరుస్తారనే నమ్మకం తనకుందని స్టాలిన్ పేర్కొన్నారు. కార్యక్రమానికి ముందు గా సామాజిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వస్తు ప్రదర్శనను సందర్శించారు. కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి, మంత్రులు కేఎన్ నెహ్రూ, పీకే శేఖర్‌బాబు, గీతా జీవన్, ఎం.సుబ్రమణ్యం, చెన్నై మేయర్ ప్రియ, ఎమ్మెల్యేలు ఇ.పరంధామన్, తాయగం కవి, డిప్యూటీ మేయర్ ఎం.మహేష్‌కుమార్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎన్.మురుగానందం, సామాజిక సంక్షేమ శాఖ కార్యదర్శి జయశ్రీ మురళీధరన్, శిశుసంక్షేమం, ప్రత్యేకసేవల శాఖ సంచాలకులు శిల్పా ప్రభాకర్ సతీష్, సామాజిక సంక్షేమ సంస్థ సంచాలకులు ఎంఎస్ సంగీతా, రాష్ట్ర ఆదర్శ పాఠశాలల విభాగం మెంబర్ సెక్రటరీ ఇరా సుదన్ తదితరులు పాల్గొన్నారు.

నేడు అమిత్‌షాతో ఈపీఎస్ భేటీ



● అన్ని వర్గాల విలీనంపై రాజీకి వచ్చేనా?



చెన్నై, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి, మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి మంగళవారం ఢిల్లీకి వెళ్తున్నారు. హస్తినలో కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షాతో భేటీ కానున్నారు. ఆ సందర్భంగా అన్నాడీఎంకే నుంచి విడిపోయిన వర్గాలను విలీనం చేసే విషయమై వారిద్దరూ సమగ్రంగా చర్చించనున్నారు. ఇప్పటికి దాకా విలీనాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్న ఈపీఎస్ హోం మంత్రి సూచనల మేరకు అన్ని వర్గాలను కలుపుకుపోతారా? లేక పట్టుసడలించక ప్రస్తుతమున్న విధంగానే పార్టీని నడిపిస్తారా? అనే ప్రశ్నలకు వారి సమావేశం తర్వాత సమాధానం లభిస్తుందని రాజకీయ పరిశీలకులు చెబుతున్నారు. వచ్చే యేడాది జరుగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో డీఎంకే నాయకత్వంలో ఇండియా కూటమిని ఢీకొట్టేలా కేంద్ర హోం మంత్రి అమిత్‌షా అన్నాడీఎంకేతో పొత్తు ఖరారు చేసుకున్నారు. ఈ రెండు పార్టీల కూటమిలో మరిన్ని పార్టీలను చేర్చుకోవాలని అమిత్‌షా భావిస్తున్నారు. ఆ దిశగా ప్రయత్నాలు ప్రారంభించేలోపే కూటమి నుండి ఏఎంఎంకే నాయకుడు టీటీవీ దినకరన్, మాజీ ముఖ్యమంత్రి ఓ.పన్నీర్‌సెల్వం వైదొలగారు. ఈ నేపథ్యంలోనే గత కొంతకాలంగా అన్నాడీఎంకే నుండి విడిపోయిన అన్ని వర్గాలను పార్టీలో విలీనం చేస్తేనే అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సులభతరమవుతుందని పలువురు నేతలు డిమాండ్ చేస్తుండటంతో ఆ దిశగా చర్యలు ప్రారంభించాలని ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్)పై రోజురోజుకూ ఒత్తిడి పెరుగుతోంది. బీజేపీ జాతీయ నేతలు కూడా పార్టీ నుండి విడిపోయిన టీటీవీ దినకరన్, ఓ పన్నీర్‌సెల్వం (ఓపీఎస్), శశికళను పార్టీలో చేర్చుకోవాలని ఈపీఎస్‌కు సూచిస్తున్నారు. ఇటీవల అన్ని వర్గాలను విలీనం చేయాలని ఈపీఎస్‌కు అల్టిమేటం జారీ చేసిన మాజీ మంత్రి సెంగోట్టయ్యాన్‌పై సస్పెన్షన్ వేటు పడింది. ఆ తర్వాత సెంగోట్టయ్యాన్ హరిద్వార్ వెళ్తున్నాని చెప్పి ఢిల్లీ వెళ్ళి కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ను కలుసుకున్నారు. ఈ పరిసితులలోనే ఈపీఎస్ మంగళవారం విమానంలో ఢిల్లీ బయలుదేరి వెళుతున్నారు. ఈ భేటీ తర్వాత ఈపీఎస్ ఉదయం 11 గంటలకు ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్‌ను కలిసి శుభాకాంక్షలు తెలుపనున్నారు. సాయంత్రం ఆయన ఢిల్లీ నుంచి నగరానికి తిరిగి రానున్నారు.

ఒకేరోజు 8 విమానాల రద్దు

పెరంబూర్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): నగరం నుంచి సోమవారం బయల్దేరాల్సిన 8 విమానాలు రద్దు చేయడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. నగరం నుంచి ముంబై, హైదరాబాద్, పూనే, తూత్తుకుడి తదితర ప్రాంతాలకు వెళ్లాల్సిన, రావాల్సిన మొత్తం 8 విమానాలను రద్దు చేశారు. ముందస్తు సమాచారం లేకుండా విమానాలు రద్దు చేయడంతో ప్రయాణికులు అధికారులతో వాగ్వివాదానికి దిగారు.

సుప్రీంకోర్టు తీర్పును స్వాగతిస్తున్నాం

వక్ఫ్ చట్ట సవరణ కేసు వ్యవహారం... సీఎం స్టాలిన్ హర్షం

ప్యారీస్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): వక్ఫ్ చట్టసవరణ బిల్లుపై సుప్రీంకోర్టు సోమవారం వెలువరించిన మధ్యంతర తీర్పును స్వాగతిస్తున్నటు ముఖ్యమంత్రి ఎంకే.స్టాలిన్ పేర్కొన్నారు. 'వక్ఫ్ చట్టసవరణ' 2025 ప్రస్తుతం దేశవ్యాప్తంగా చర్చకు దారితీస్తోంది. మతపరమైన ఆస్తుల పరిరక్షణ పేరుతో చేసిన ఈ సవరణలో రాజ్యాంగ భద్రతపైనే సందేహాలు రేపుతున్నాయి. తాజాగా ఈ చట్టంలోని కొన్ని కీలక సెక్షన్లపై సుప్రీంకోర్టు మధ్యంతర స్టే విధించింది. తమిళనాడు సహా పలు రాష్ట్రాల నుండి దాఖలైన పిటిషన్లలో సవరణలు, మౌలిక హక్కులకు విరుద్ధమని, ప్రజాస్వామ్యానికి భంగం కలిగిస్తున్నాయని ఆరోపణలు వచ్చాయి. దీనిపై స్పందించిన సుప్రీంకోర్టు వక్ఫ్ చట్టసవరణ 2025లోని కొన్ని నిబంధనల అమలును తాత్కాలికంగా నిలిపివేసింది. ఈ చట్టం మొత్తం చెల్లుబాటవుతుందని, కానీ కొన్ని వివాదాస్పద సెక్షన్లపై స్టే విధించినట్లు సీజేఐ గవాయ్ తెలిపారు. ఆయన ఇచ్చిన తీర్పులో ఆస్తిని వక్ఫ్‌కు దానం చేయాలంటే కనీసం ఐదు సంవత్సరాలు ఇస్లాం మతాన్ని అచరించాలనే నిబంధన, నియమిత అధికారి నివేదిక ఇచ్చేవరకు ఆస్తిని వక్ఫ్ ఆస్తిగా పరిగనించాలన్న నిబంధన నిలిపివేశారు. రెవెన్యూ రికార్డుల్లో మార్పులు చేసే అధికారం కలెక్టర్‌కు ఇవ్వడం అధికారం వ్యతిరేకం. అధికారుల తుది నివేదిక వచ్చేవరకు ఆస్తులు ప్రభావితం కావు. వక్ఫ్ బోర్డులో నలుగురు కంటే ఎక్కువ మంది ముస్లింయేతరులు సభ్యులుగా ఉండకూడదు. రాష్ట్రస్థాయిలో ముగ్గురు కంటే ఎక్కువ ఉండరాదు. ముఖ్యంగా వక్ఫ్ బోర్డు చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (సీఈవో) ముస్లిం సమాజానికి చెందినవారై ఉండాలని సుప్రీంకోర్టు సూచించింది." ఈ తీర్పును స్వాగతించిన సీఎం కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగానికి వ్యతిరేకంగా వ్యవహరించడం సరి కాదని తెలిపారు. సోమవారం విడుదలైన సుప్రీంకోర్టు ఉత్తర్వుల వల్ల ముస్లింల మతపరమైన నైతిక హక్కులను రాజ్యాంగాన్ని కాపాడే విధంగా ఉండటంతో పాటు సుప్రీంకోర్టుపై ప్రజల నమ్మకం మరింత పెరుగుతుందని స్టాలిన్ తన ప్రకటనలో అభిప్రాయపడ్డారు.

రాజకీయాల్లోకి ఎవరొచ్చినా వారికి డీఎంకే టార్గెట్

● ఎంపీ కనిమొళి

చెన్నై, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): కొత్తగా రాజకీయాల్లోకి ఎవరొచ్చినా ప్రజలకు తాము చేయబోయే సత్కార్యాలను గురించి చెప్పకుండా డీఎంకేని అదే పనిగా తిట్టడమే ఆనవాయితీగా మారిందని ఎంపీ కనిమొళి ఆవేదన వ్యక్తం చేశారు. డీఎంకే వ్యవస్థాపకుడు అన్నాదురై జయంతి సందర్భంగా కన్నియాకుమారి రౌండ్ ఠాణా జంక్షన్ వద్దనున్న విగ్రహానికి ఆమె పూలమాల వేసి నివాళులర్పించారు. ఆ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ.. రాజకీయ ప్రవేశం చేసేవారంతా డీఎంకేపై విమర్శలు చేస్తేనే తమ పార్టీకి గుర్తింపు లభిస్తుందని భావించడం పరిపాటిగా మారిందన్నారు. ఏడు దశబ్దాలకు పైగా ప్రజలతో మమేకమైన డీఎంకేని దూషించే అర్హత తమకు ఏ మాత్రం లేదని తెలిసి కూడా కొత్త పార్టీల నేతలు దూషిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి మనో తంగరాజ్, కన్నియాకుమారి మేయర్ మహేష్ తదితరులు పాల్గొన్నారు.



అన్నాదురై చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎంపీ కనిమొళి

7 లో..

ఘనంగా అన్నాదురై జయంతి వేడుకలు

● రాష్ట్రవ్యాప్తంగా సంక్షేమ సహాయాల పంపిణీ
● నేతల ఘన నివాళి

ఓట్ల చోరీకి వ్యతిరేకంగా సంతకాల ఉద్యమం

● టీఎన్‌సీసీ అధ్యక్షుడు సెల్వపెరుంతగై



క్రైస్తవ సంఘ సమావేశంలో ప్రసంగిస్తున్న సెల్వపెరుంతగై

చెన్నై, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఓట్ల చోరీలకు పాల్పడుతున్న కేంద్ర ఎన్నికల సంఘాన్ని తీవ్రంగా ఖండిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా కోటిమందితో సంతకాల ఉద్యమం నిర్వహించనున్నట్లు టీఎన్‌సీసీ అధ్యక్షుడు సెల్వపెరుంతగై ప్రకటించారు. కేంద్ర ఎన్నికల సంఘం ఓట్ల చోరీకి పాల్పడిన విషయాన్ని బట్టబయలుచేసి, అన్ని రాష్ట్రాల్లో ఓట్ల చోరీ నిరోధించాలని పిలుపునిస్తూ కాంగ్రెస్ పార్లమెంటరీ పక్ష నాయకుడు రాహుల్‌గాంధీ జరుపుతున్న ఉద్యమాలకు అపూర్వమైన ప్రజాస్పందన లభించిందని ఆయన చెప్పారు. సోమవారం శ్రీపెరుంబుదూరు సమీపంలోని మాంగాడు క్రైస్తవ సంఘ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఓట్ల చోరీలకు నిరసనగా దేశవ్యాప్తంగా 5 కోట్ల మందితో సంతకాలు సేకరించే ఉద్యమాలు జరుపనున్నట్లు రాహుల్ చేసిన ప్రకటన మేరకు రాష్ట్రంలో సంతకాల సేకరణ చేపట్టనున్నామన్నారు. ఈ సంతకాల సేకరణ అక్టోబర్ 15 వరకు కొనసాగుతుందని, ఈ విషయంగా జిల్లా కాంగ్రెస్ నేతలు సహాయ సహకారాలను అదించాలని తెలిపారు.



చెన్నై రాజాజీసాలైలో 160 యేళ్లనాటి రిజిస్ట్రేషన్ శాఖ కార్యాలయంలో కొత్తగా నిర్మించిన మీటింగ్ హాలును ప్రారంభిస్తున్న మంత్రి పి. మూర్తి

పీఎంకే అధ్యక్షుడు అన్బుమణి

● ఈసీ గుర్తింపు ఇచ్చిందన్న న్యాయవాది బాలు

చెన్నై, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): పాట్టాలి మక్కల్ కట్చి (పీఎంకే) అధ్యక్షుడిగా డాక్టర్ అన్బుమణిని కేంద్ర ఎన్నికల సంఘం గుర్తించిందని పార్టీ న్యాయవిభాగం నేత, సీనియర్ న్యాయవాది బాలు తెలిపారు. నగరంలో సోమవారం మీడియా సమావేశంలో బాలు మాట్లాడుతూ ఆగస్టు 9న మహాబలిపురంలో అన్బుమణి అధ్యక్షతన నిర్వహించిన సర్వసభ్యమండలి సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను, తీర్మానాలను కేంద్ర ఎన్నికల సంఘం అంగీకరించిందని, ఈ మేరకు తమకు వర్తమానం కూడా పంపిందని చెప్పారు. సర్వసభ్యమండలి సమావేశంలో అన్బుమణిని వచ్చే యేడాదివరకు పార్టీ అధ్యక్షుడిగా కొనసాగిస్తూ చేసిన తీర్మానాన్ని కూడా ఈసీ అంగీకరించిందన్నారు. ఇదే విధంగా అన్బుమణి నాయకత్వంలోని పార్టీ వివిధ విభాగాలకు చెందిన కార్యవర్గాలను కూడా గుర్తించిందని, టి.నగర్‌లోని పార్టీ కార్యాలయాన్ని ప్రధాన కార్యాలయం కూడా ఈసీ అంగీకరించినట్లు వర్తమానం పంపిందని బాలు పేర్కొన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం నుండి వచ్చిన లేఖతో నెలల తరబడి పార్టీలో నెలకొన్న అయోమయానికి తెరపడిందని ఆయన చెప్పారు. అన్బుమణే పీఎంకే అధ్యక్షుడని, ఆయన వర్గానికే పార్టీ చిహ్నం మామిడిపండు అని ఈసీ లేఖ ద్వారా సుస్పష్టమైందన్నారు. బాలు ప్రకటనతో పీఎంకే కార్యాలయం వద్ద పార్టీ శ్రేణులు టపాసులు పేల్చి సందడి చేశారు. పార్టీ వ్యవస్థాపకుడు రాందాస్ ఆశయాలకనుగుణంగానే తామంతా పార్టీకి సేవలు చేస్తున్నామని, అన్బుమణి నాయకత్వాన్ని అందరూ అంగీకరించాలని బాలు పార్టీ శ్రేణులకు ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు.



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న పీఎంకే న్యాయవాది బాలు



ఓమందూరార్ ప్రభుత్వ ఆస్పత్రి ప్రాంగణంలో ప్రజారోగ్యశాఖలో నర్సులుగా ఎంపికైన వారికి నియామక పత్రాలు అందజేస్తున్న ఆరోగ్య శాఖ మంత్రి ఎం.సుబ్రమణ్యం

సమాచార దృష్టి

వేదవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో 28న 'అభిజ్ఞాన శాకుంతలం'పై ప్రసంగం

చెన్నై, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): వేదవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో 'మహాకవి కాళిదాసు అభిజ్ఞాన శాకుంతలం' అనే అంశంపై ప్రసంగ కార్యక్రమం ఉంటుంది. తరతరాల తెలుగు కవిత ఉపన్యాస ధారావాహిక 165వ ప్రసంగ కార్యక్రమంగా వివేకానంద కళాశాల సంస్కృత శాఖాధ్యక్షులు డాక్టర్ కల్లే ప్రశాంత్ అభిజ్ఞాన శాకుంతలంపై ప్రసంగించనున్నారని వేద విజ్ఞాన వేదిక అధ్యక్షులు జేకే రెడ్డి, కార్యదర్శి కందనూరు మధు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 28 సాయంత్రం 6.30 గంటలకు టీనగర్ ఆంధ్రాక్లబ్ కృష్ణాహాలులో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామని, తెలుగు సాహితీ ప్రియులందరూ ఈ కార్యక్రమానికి హాజరుకావాలని విజ్ఞప్తి చేశారు.

నేడు పోరూర్‌లో విద్యుత్ గ్రీవెన్స్

పెరంబూర్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక పోరూర్ చెట్టియార్ అగరం రోడ్డుని ఎస్ఆర్ఎంసీ ఉప విద్యుత్ కేంద్రం ప్రాంగణంలోని నిర్వహణ ఇంజనీర్ కార్యాలయంలో మంగళవారం ఉదయం 11 గంటలకు విద్యుత్ గ్రీవెన్స్ జరుగనుంది. పోరూర్, చుట్టుపక్కల ప్రాంతాల వినియోగదారులు పాల్గొని, విద్యుత్ ఛార్జీలు, కొత్త కనెక్షన్లు, విద్యుత్ కోతలు తదితర అంశాలపై ఫిర్యాదు చేసి పరిష్కారం పొందవచ్చని విద్యుత్ బోర్డు ఒక ప్రకటనలో తెలిపింది.

ఎంటీసీలో అప్రెంటీస్ శిక్షణ

పెరంబూర్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మెట్రో ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ (ఎంటీసీ)లో అప్రెంటీస్ శిక్షణకు ఆసక్తి కలిగిన వారు దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ మేరకు ఎంటీసీ విడుదల చేసిన ప్రకటనలో.. 2021 నుంచి ప్రస్తుత విద్యా సంవత్సరం వరకు మెకానికల్, ఆటోమొబైల్, సివిల్, ఈసీఈ తదితర కోర్సులు పూర్తిచేసిన వారు, బీఏ, బీఎస్సీ, బికాం, బీబీఏ, బీబీఎం తదితర విభాగాల్లో డిగ్రీ చదివిన వారు ఈ శిక్షణకు అర్హులు, ఆసక్తి ఉన్న వారు https://nats.education.gov.in అనే వెబ్‌సైట్‌లో అక్టోబరు 18వ తేది లోపు దరఖాస్తు చేసుకోవాలని ఎంటీసీ తెలిపింది.

'గేట్' దరఖాస్తు గడువు పొడిగింపు

పెరంబూర్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది 'గేట్' రాష్ట్రవ్యాప్తంగా 170 కేంద్రాల్లో నవంబరు 30న ఆన్‌లైన్‌లో జరుగనుంది. ఉదయం 8.30 నుంచి 10.30, మధ్యాహ్నం 12.30 నుంచి 2.30, సాయంత్రం 4.30 నుంచి 6.30 గంటల వరకు మూడు సెషన్స్‌లో పరీక్ష నిర్వహించనున్నారు. ఈ పరీక్షకు ఆన్‌లైన్ దరఖాస్తు స్వీకరణ ఆగస్టు 1న ప్రారంభమై ఈ నెల 13వ తేదీతో ముగిసింది. విద్యార్థులు, తల్లిదండ్రుల విజ్ఞప్తితో దరఖాస్తు సమర్పణ గడువు ఈ నెల 20వ తేది వరకు పొడిగించారు. ఆసక్తి కలిగిన పట్టభద్రులు https://iimcat.ac.in అనే వెబ్‌సైట్‌లో పూర్తి వివరాలతో నమోదుచేసుకోవాలి. దరఖాస్తుతో పాటు ఫీజుగా ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు రూ.1,300, ఇతర విభాగాల వారు రూ.2,600 చెల్లించాల్సి ఉంది. హాల్ టిక్కెట్లు నవంబరు 5వ తేది విడుదల చేస్తామని, పరీక్షా ఫలితాలు జనవరి మొదటి వారంలో విడుదల చేయనున్నట్లు ఆ శాఖ అధికారులు తెలిపారు.

పెంపుడు జంతువుల వివరాలు నమోదు

పెరంబూర్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): తాంబరం కార్పొరేషన్ పరిధిలో పెంపుడు జంతువుల వివరాలు నమోదుచేసి, లైసెన్స్ సర్టిఫికెట్ పొందాలని అధికారులు తెలిపారు. కార్పొరేషన్ పరిధిలోని 5 మండలాల్లో పెంపుడు జంతువులకు వేసిన టీకాలు, పశు వైద్యుల వివరాలను tcmcpublichealth.in Pet AnimalRegister అనే వెబ్‌సైట్‌లో నమోదు చేయాలని సూచించారు. లైసెన్స్ సర్టిఫికెట్ జారీచేసిన తేది నుంచి ఏడాది పాటు చెల్లుబాటు అవుతుందన్నారు. గడువు ముగిసిన లైసెన్స్ సర్టిఫికెట్లు వెబ్‌సైట్‌లో పునరుద్ధరించుకోవాలని విజ్ఞప్తి చేశారు.

బీఎడ్, ఎంఎడ్ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

పెరంబూర్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ, ఎయిడెడ్ కళాశాలల్లో బీఎడ్, ఎంఎడ్ కోర్సుల్లో చేరేందుకు ఆసక్తి ఉన్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చని ఉన్నత విద్యాశాఖ మంత్రి కొవి చెళియన్ తెలిపారు. ఈ మేరకు మంత్రి విడుదల చేసిన ప్రకటనలో... 2025-26వ విద్యా సంవత్సరానికి బీఎడ్, ఎంఎడ్ కోర్సుల్లో అడ్మిషన్లకు సంబంధించి దరఖాస్తు స్వీకరణ, కౌన్సెలింగ్ జరుగుతుందని తెలిపారు. తొలివిడత కౌన్సెలింగ్ ముగిసిన నేపథ్యంలో, 2 ప్రభుత్వ విద్యా కళాశాలల్లో 49 సీట్లు, 13 ఎయిడెడ్ కళాశాలల్లో 530 సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. ఈ సీట్లు భర్తీకి సోమవారం నుంచి ఈ నెల 30వ తేది వరకు టీటీట్బీజబ్బట్ఇజీ అనే వెబ్‌సైట్‌లో విద్యార్థులు దరఖాస్తులు సమర్పించవచ్చని తెలిపారు. అలాగే, మరిన్ని వివరాలు www.lwiase.ac.in అనే వెబ్‌సైట్ ద్వారా తెలుసుకోవచ్చని మంత్రి సూచించారు.

జలాశయాల్లో పెరిగిన నీటి మట్టం

పెరంబూర్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూర్ జిల్లాలో కురుస్తున్న వర్షాల కారణంగా నగరానికి తాగునీరందించే పుళల్ జలాశయానికి 417 ఘనపుటడుగుల నీరు చేరుతోంది. 3,300 మిలియన్ ఘనపుటడుగుల సామర్థ్యం కలిగిన పుళల్ జలాశయంలో ప్రస్తుతం 2,964 మిలియన్ ఘనపుటడుగుల నీరుంది. ఆ ప్రకారం, 21.2 అడుగుల ఎత్తున్న పుళల్ జలాశయంలో 19.76 అడుగులతో సముద్రాన్ని తలపిస్తోంది. అలాగే, 1081 మిలియన్ ఘనపుటడుగుల సామర్థ్యం కలిగిన చోళవరం జలాశయంలో ప్రస్తుతం 175 మిలియన్ ఘనపుటడుగుల నీరుండగా, మూడు రోజులుగా జలాశయానికి 44 ఘనపుటడుగుల నీరు చేరుతోంది. 18.86 అడుగుల ఈ జలాశయంలో 4.37 అడుగుల మేర నీటిమట్టాలున్నాయని ప్రజాపనుల శాఖ అధికారులు తెలిపారు.

ఈపీఎస్ ప్రచారంలో మార్పు

పెరంబూర్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్) 5వ విడత ప్రచారం ఈ నెల 26వ తేది వరకు కొనసాగనుండగా, 17,18 తేదీల్లో ధర్మపురి జిల్లాల్లో ప్రచారం చేపట్టనున్నట్లు ప్రకటించారు. కానీ, ఆ రెండు రోజులు భారీవర్షాలు కురిసే అవకాశముందని చెన్నై వాతావరణ పరిశోధన కేంద్రం హెచ్చరికల నేపథ్యంలో, ఈపీఎస్ తన ప్రచారంలో మార్పులు చేశారు. ఆ ప్రకారం, 28న ధర్మపురి, పాపిరెడ్డిపట్టి, అరూర్ తదితర శాసనసభ నియోజకవర్గాలు, 29న పాలక్కోడు, పెన్నాగరం శాసనసభ నియోజకవర్గాల్లో ఈపీఎస్ ప్రచారం చేపట్టనున్నారని అన్నాడీఎంకే ప్రధాన కార్యాలయం ప్రకటన విడుదల చేసింది.

ఉచిత పథకాలకు కోట్లు ఖర్చు ....

నర్సుల జీతాలకు నిధుల కొరతా.?

● రాష్ట్ర ప్రభుత్వంపై సుప్రీంకోర్టు ఆగ్రహం



పెరంబూర్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఉచిత పథకాల కోసం కోట్లాది రూపాయలను ఖర్చుపెడుతూ, రోగులకు సేవలందిస్తూ తీవ్రంగా శ్రమించే నర్సుల వేతనాల పెంచేందుకు నిధుల కొరతంటూ సాకులు చెప్పటం భావ్యమేనా అంటూ రాష్ట్ర ప్రభుత్వంపై సుప్రీం కోర్టు ఆగ్రహం ప్రకటించింది. రాష్ట్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు సహా పలు ప్రభుత్వాసుపత్రుల్లో శాశ్వత ప్రాతిపదికన నర్సుల నియామకాలు చేపట్టకుండా, కాంట్రాక్టు విధానంలో నియమించి, వారికి తక్కువ వేతనాలుఇస్తున్నారని, వారి జీతాలను పెంచాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌పై విచారణ జరిపిన హైకోర్టు కాంట్రాక్టు నర్సులకు రెగ్యులర్ నర్సులకు చెల్లిస్తున్న వేతనాలే అమలు చేయాలని ఆదేశించింది. హైకోర్టు ఉత్తర్వును సవాలు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో దాఖలుచేసిన అప్పీలు పిటిషన్ సోమవారం విచారణకు వచ్చింది. ఆ సమయంలో, కాంట్రాక్ట్ నర్సులకు తక్కువ వేతనంఇస్తూ, రాష్ట్ర ప్రభుత్వం వారిని ఇబ్బందులకు గురిచేస్తుందని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. అలాగే, ప్రజారోగ్యం కోసం శ్రమిస్తున్న నర్సులకు తగిన వేతనం ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించింది. అలాగే, ఉచిత పథకాలకు కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తుండగా, ప్రజల ప్రాణాలు కాపాడే విధులు నిర్వహిస్తున్న నర్సులకు వేతనాలు అందించేందుకు నిధులు లేవా? అంటూ ప్రశ్నించింది. నర్సులకు వేతనాలు చెల్లించేందుకు అవసరమైన నిధులు కేంద్ర ప్రభుత్వం నుంచి రాలేదని రాష్ట్ర ప్రభుత్వ తరఫు న్యాయవాది తెలిపారు. ఈ వాదనపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ నర్సుల వేతనాల పెంపు వ్యవహారాన్ని బాధ్యతాయుతంగా నిర్వర్తించాల్సిన రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వంపై సాకులు చెప్పడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించింది. కాంట్రాక్ట్ నర్సుల సంఘం డిమాండ్లను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరిశీలించాలని ఉత్తర్వులు జారీ చేసింది. నాలుగు వారాల్లో ఈ విషయమై కౌంటర్ అఫిడవిట్ దాఖలుచేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు నోటీసులు జారీ చేసింది.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పెరంబూర్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ మార్గాల్లో మరమ్మతుల కారణంగా దిగువ ప్రాంతాల్లో మంగళవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ బోర్డు ఒక ప్రకటనలో తెలిపింది.

అడయార్: వెంకటేశ్వర నగర్, ఎంజీఆర్ నగర్, బైపాస్ రోడ్డు, దేవి కరుమారియమ్మన్ నగర్, శశి నగర్, పద్మావతీ నగర్, మురుగన్ నగర్, విజయ నగర్, గంగై నగర్, భువనేశ్వరి నగర్, రామ్ నగర్, నెహ్రూ నగర్, దండీశ్వరం నగర్, వేళచ్చేరి మెయిన్ రోడ్డు, వందడుగుల రోడ్డు, రాజ్యలక్ష్మి నగర్, జగన్నాథపురం, తిరువపాదియమ్మన్ ఆలయం, గాంధీ వీధి, టాన్సీ నగర్, వీజీపీ సెల్వ నగర్, సీతారామన్ నగర్, తరమణి, బేబి నగర్

మడిపాక్కం: షీలా నగర్, అన్నై థెరిస్సా నగర్, సదాశివం నగర్, గోవిందస్వామి నగర్, రాజాజీ నగర్, రామ్ నగర్ సౌత్, కుబేర నగర్, అంబుగ నగర్, ఎల్ఐసీ నగర్, లక్ష్మీ నగర్, రాజరాజేశ్వరి నగర్, భజన ఆలయ వీధి, పెరియార్ నగర్, కులకరై వీధి, బజార్ రోడ్డు, ఎన్‌ఫీల్డ్ అవెన్యూ, శ్రీ నగర్, అయ్యప్ప నగర్, మేడవాక్కం మెయిన్ రోడ్డు, గణేష్ నగర్, అలమేలు మంగాపురం, గాంధీ నగర్, కేజీకే నగర్, వెంకటేశ్వర నగర్, జయలక్ష్మి నగర్, పొన్నియమ్మన్ ఆలయ వీధి, రాఘవ నగర్, విశాల్ నగర్, అరుళ్‌మురుగన్ నగర్, అన్నా నగర్, రామమూర్తి నగర్, కార్తికేయపురం, శబరి రోడ్డు, వైవానై నగర్, మధురకాళి నగర్, మడిపాక్కం మెయిన్ రోడ్డు, మూవరసంపేట, వెంకట్రామన్ వీధి, భారత్ వీధి, రాజా వీధి, తిలగర్ అవెన్యూ, ఆండవర్ వీధి, ఓట్టేరి రోడ్డు, ఈవీఆర్ కాలనీ, రాఘవన్ నగర్, చర్చి వీధి, కలైమగళ్ వీధి, మురుగప్ప నగర్, శ్రీధరన్ నగర్, అమ్మన్ నగర్, చెంగాలియమ్మన్ వీధి, హిందూ కాలనీ, గణేష్ నగర్, ఎస్ఎస్సీ బోస్ రోడ్డు, పుళిదివాక్కం

రాయపేట: మాణిక మేస్త్రి వీధి, మిర్‌భాక్షిఅలి వీధి, మహ్మద్ హుస్సేన్ వీధి, నాయర్ వరదపిళ్లై వీధి, పెరుమాళ్ ముదాలి వీధి, రామస్వామి గార్డెన్ వీధి, సీఎస్ దురైస్వామి కాలనీ, తాలయారి వీధి, వెస్ట్ కోట్ వీధి, అర్మగ వైదయార్ వీధి, డా.నిజామత్తుల్లా వీధి, దేవరాజ్ వీధి, ఎరుసప్పన్ వీధి, గజతే బేగం వీధి, హాజి షేక్ హుస్సేన్ వీధి, జానిజాని ఖాన్ రోడ్డు, సూరప్పన్ వీధి, సుబ్రమణియ వైదయార్ వీధి, షేక్ దావూద్ వీధి, సుప్రుద్దీన్ గార్డన్ వీధి, దీదారప్పన్ వీధి, తంబునాయకన్ వీధి, తిరునావుక్కరసు వీధి, తంగవేల్ వాదయర్ వీధి, అంగముత్తు నాయకన్ వీధి, చిన్నప్ప రౌథర్ వీధి, జనరల్ స్వర్ణినాయకన్ వీధి, జాఫర్‌సాహిబ్ వీధి, హెచ్ఎంపీ వీధి, అయ్యాస్వామి చెట్టి వీధి, కోయఅరునగరి వీధి, రామస్వామి మేస్త్రి వీధి, సుబ్బరాయ చెట్టి వీధి, తానప్ప చెట్టి వీధి, డా.బీసెంట్ రోడ్డు, పీటర్స్ రోడ్డు

అన్నానగర్: పి-బ్లాక్ నుంచి జడ్-బ్లాక్, జి-బ్లాక్, వసంతం కాలనీ, ఉదయం కాలని, ఐశ్వర్య కాలనీ, బీఎస్ఎన్ఎల్ క్వార్టర్స్, ఆర్బీఐ క్వార్టర్స్, సీపీడబ్ల్యూడీ క్వార్టర్స్, పొన్ని కాలని, బెల్లి ఏరియా, తంగం కాలని, జయంతది కాలని, రంగనాధన్ గార్డన్స్, టవర్ వ్యూ కాలని, గార్డెన్ వ్యూ అపార్ట్‌మెంట్, పోలీసు ఏసీ క్వార్టర్స్, విజయశ్రీ మహల్, అంబేడ్కర్ నగర్, వందపడకల ఆస్పత్రి, ఎం.ఎన్ బ్లాక్, అన్నై సత్యా నగర్, రాయల్ ఎన్‌క్లేవ్

సెంబియం: కామరాజర్ రోడ్డు, గాంధీ నగర్ 1 నుంచి 4 వీధులు, ఆర్సీ అపార్ట్‌మెంట్స్, జైన్ అపార్ట్‌మెంట్స్, మూలకడై, జీఎన్టీ రోడ్డు, ఎమ్మార్‌హెచ్ రోడ్డు, జంబులి వీధి, దేవి నగర్, వీఓసీ వీధి, నేతాజీ వీధి, వివేకానందర్ వీధి, గంగైఅమ్మన్ ఆలయ వీధి, భారతి వీధి, తిలగర్ వీధి, రాజాజీ వీధి, పీఆర్‌హెచ్ రోడ్డు, విల్లివాక్కం రోడ్డు, జ్యోతి నగర్, రోజా నగర్, వివేకానంద మెయిన్ రోడ్డు టీచర్స్ కాలని, సత్య నగర్, భవానీ నగర్, మహ్మద్‌హుస్సేన్ కాలనీ, తిరుమలై నగర్, కడప రోడ్డు, కృష్ణా నగర్, రంగ గార్డెన్

ఎన్నికలకు సన్నద్ధమవ్వండి

● కార్యకర్తలకు ఎమ్మెల్యే చంద్రన్ పిలుపు



రిబ్బన్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే ఎస్.చంద్రన్

తిరుత్తణి సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా పళ్లిపట్టు నార్త్ యూనియన్‌లో నూతన డీఎంకే కార్యాలయాన్ని ఆదివారం తిరుత్తణి ఎమ్మెల్యే ఎస్.చంద్రన్ ప్రారంభించారు. కార్యదర్శి సీజే.శ్రీనివాసన్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే చంద్రన్ మాట్లాడుతూ, పళ్లిపట్టు నార్త్ యూనియన్ పరిధిలో పార్టీ బలోపేతానికి కృషిచేస్తున్న కార్యకర్తల కష్టం ఎనలేనిదని కొనియాడారు. బూత్ కమిటీ నిర్వాహకుల కార్యాచరణలకై నార్త్ యూనియన్‌లో ప్రత్యేకంగా కార్యాలయం కావాలని ఆ ప్రాంత డీఎంకే నేతలు, కమిటీ నిర్వాహకుల కోరిక మేరకు జూలైలో పూజాకార్యక్రమాలు నిర్వహించి నిర్మాణ పనులను ప్రారంభించామని, ఆ భవనం పూర్తయిన సందర్భంగా ఆదివారం అభిమానులు, కార్యకర్తల సమక్షంలో ప్రారంభించినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పళ్లిపట్టు పట్టణ కార్యదర్శి సీజే.సెంథిల్‌కుమార్, కౌన్సిలర్లు మురళి, విజయాలు, చిరంజీవి, యూత్ వింగ్ అధ్యక్షుడు ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.

రామేశ్వరం-కాశీ ఆధ్యాత్మిక రైలు యాత్ర

పెరంబూర్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రానికి చెందిన 600 మంది భక్తులను రామేశ్వరం నుంచి రైలులో కాశికి ఉచితంగా ఆధ్యాత్మిక యాత్రకు తీసుకువెళ్తున్నట్లు హిందూ దేవాదాయ శాఖ తెలిపింది. ఈ శాఖ ఆధ్వర్యంలో (2025-26) ఏడాదికి సంబంధించి రామేశ్వరం నుంచి రైలులో కాశీకి 10 రోజుల ఆధ్యాత్మిక యాత్రకు తీసుకెళ్లనున్నారు. ఆసక్తి కలిగిన వారు ఆయా మండల హిందూ దేవాదాయ జాయింట్ కమిషనర్ కార్యాలయం, ww-w.-h-r-ce.tn.-go-v.in అనే వెబ్‌సైట్‌లో పేర్లు నమోదుచేసుకోవాలి. పూర్తిచేసిన దరఖాస్తులను ఆయా కార్యాలయాల్లో అక్టోబరు 22వ తేదిలోగా సమర్పించాలి. 60 నుంచి 70 ఏళ్లలోపున్న హిందూ మతానికి చెంది, వార్షికాదాయం రూ.2 లక్షల లోపుండి, వైద్యం, వయసు సర్టిఫికెట్లు, ఆధార్, పాన్ కార్డు, మొబైల్ నెంబరు, 3 పాస్ పోర్ట్ సైజు ఫొటోలు దరఖాస్తుతో జతచేయాలి. గతంలో ప్రభుత్వం కల్పించిన ఉచిత ఆధ్యాత్మిక పర్యటనలో పాల్గొని ఉండరాదు. ఈ విషయమై దేవాదాయ శాఖ అధికారులు మాట్లాడుతూ... ఒక్కో జాయింట్ కమిషనరేట్ నుంచి 30 మంది చొప్పున 20 మండల జాయింట్ కమిషనర్ కార్యాలయాల ద్వారా 600 మంది భక్తులను రామేశ్వరం నుంచి కాశీకి యాత్రకు తీసుకెళ్లనున్నామన్నారు. యాత్ర మొదలయ్యే తేదీ త్వరలో ప్రకటిస్తామని తెలిపారు. రామేశ్వరంలో దర్శనం అనంతరం కాశీ వెళ్లి అక్కడ స్వామి దర్శనం చేసుకుని మళ్లీ రామేశ్వరం చేరుతుందని అధికారులు తెలిపారు.

నేడు 'ఉంగళుడన్ స్టాలిన్' శిబిరాలు

పెరంబూర్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ (జీసీసీ) పరిధిలో మంగళవారం నిర్వహించనున్న 'ఉంగళుడన్ స్టాలిన్' శిబిరాల వివరాలకు జీసీసీ ఒక ప్రకటనలో తెలిపింది. 1వ మండలం పరిధిలో 5వ వార్డు ఎన్నూర్ ఎక్స్‌ప్రెస్ రోడ్డు (పద్మావతి అమ్మన్ ఆలయ ఖాళీ ప్రదేశం), 2వ మండలం పరిధిలో 17వ వార్డు వడపెరుంబాక్కం ఎమ్మార్‌హెచ్‌లోని కమ్యూనిటీ హాలు, 5వ మండలం పరిధిలో 51వ వార్డు కళింగరాయన్ వీధిలోని అన్నా కల్యాణ మండలం, 6వ మండలం పరిధిలో 72వ వార్డు పులియాంతోపు కాస్టర్ రోడ్డులోని డాన్ బాస్కో ప్రాంగణం, 7వ మండలం పరిధిలో మొగప్పేర్ వెస్ట్ సెయింట్ మనోహరం నగర్ వళ్లలార్ వీధిలోని సుప్రభ మహల్, 8వ మండలం పరిధిలో 100వ వార్డు షేనాయ్ నగర్ టీపీ సత్రం మెయిన్ రోడ్డులోని అన్నా కమ్యూనిటీ హాలులో శిబిరాలు నిర్వహించనున్నారు. అలాగే, 9వ మండలం పరిధిలో 113వ వార్డు టి.నగర్ హబీబుల్లా రోడ్డులోని ఎస్‌జీఎస్ సభ, 10వ మండలం పరిధిలో 135వ వార్డు అశోక్ నగర్ 1వ అవెన్యూ లోని లక్ష్మీ మహల్, 14వ మండల పరిధిలో 181వ వార్డు కొట్టివాక్కం కుప్పం బీచ్ సమీపం ఏజీఎస్ మెయిన్ రోడ్డులోని కబడ్డీ మైదానం, 15వ మండలం పరిధిలో 192వ వార్డు నీలాంగరై ఆర్కే కన్వెన్షన్ సెంటర్‌లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నిర్వహించే శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జీసీసీ విజ్ఞప్తి చేసింది.

తక్కువ నాణ్యతతో దగ్గు మందు తయారీ

హిమాచల్ సంస్థకు జరిమానా

పెరంబూర్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): నాణ్యత తక్కువగా ఉన్న దగ్గు మందు తయారుచేసిన హిమాచల్ ప్రదేశ్‌కు చెందిన సంస్థకు విరుదాచలం మేజిస్ట్రేట్ కోర్టు జరిమానా విధించింది. హిమాచల్ ప్రదేశ్ పొండా సాహిబ్‌లోని నరివాలా ప్రాంతంలో ఉన్న ఎం/ఎస్ లాబొరేటరీ ఫార్మాస్యూటికల్స్ (ఎల్‌బీఎల్) తయారు చేసిన దగ్గు ఔషధం నాణ్యత తక్కువగా ఉందని 2019లో ఫిర్యాదు అందింది. ఆ ఫిర్యాదుపై అప్పటి కడలూరు జిల్లా డ్రగ్ ఇన్‌స్పెక్టర్ సిఫారసు మేరకు, దగ్గు మందు నాణ్యతపై ల్యాబ్‌లో పరీక్షలు నిర్వహించగా, ఔషధం నాణ్యత తక్కువగా ఉందని నిర్ధారణ అయింది. అనంతరం ఫార్మాస్యూటికల్ సంస్థ వ్యవస్థాపక డైరెక్టర్ బైదేవ్‌రాజ్ భాటియా, కుమారుడు సంజీవ్ భాటియా, వైస్ చైర్మెన్ సునీల్ వశిష్టపై 2019 నవంబరు 29వ తేది విరుదాచలం మేజిస్ట్రేట్ కోర్టు-1లో కేసు నమోదైంది. ఈ కేసు విచారణకు రాగా మందుల సంస్థ, వైస్ చైర్మెన్ సునీల్ వశిష్టకు తలా రూ.20 వేల జరిమానా విధిస్తూ మేజిస్ట్రేట్ అరవిందన్ తీర్పునిచ్చారు. ఈ కేసులో రెండో నిందితుడు, కంపెనీ డైరెక్టర్ సంజీవ్ భాటియా మృతిచెందడంతో, ఆయన పేరు కేసు నుంచి తొలగించారు.

విషజ్వరంతో విద్యార్థిని మృతి

పెరంబూర్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): విషజ్వరంతో ప్లస్ వన్ విద్యార్థిని మృతిచెందిన ఘటన ఆవడి సమీపంలో చోటుచేసుకుంది. ఆవడి నందనమేట్టూరు కన్నియమ్మన్ వీధికి చెందిన గౌతమ్ కుమార్తె మధుమిత (16) ఓ ప్రైవేటు పాఠశాలలో ప్లస్ టూ చదువుతోంది. రెండు రోజుల క్రితం జ్వరం రావడంతో మధుమితను తల్లిదండ్రులు ఆవడిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. మరుసటిరోజు ఆమెకు జ్వరం అధికం కావడంతో, ఆవడిలోని మరో ప్రైవేటు ఆస్పత్రికి తీసుకువెళ్లారు. అక్కడ చికిత్స ఫలించక మధుమిత మృతిచెందింది. ఆవడి పోలీసులు విద్యార్థిని మృతదేహాన్ని పోస్టుమార్టం తరలించి, ఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

కోయంబేడులో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు అధికారుల నియామకం

అడయార్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక కోయంబేడు మార్కెట్‌లో ట్రాఫిక్ సమస్యను పరిష్కరించేందుకు వీలుగా ఐదుగురు ప్రత్యేక అధికారులను ట్రాఫిక్ పోలీస్ విభాగం నియమించింది. ఆ ప్రాంతంలో ఎలాంటి ట్రాఫిక్ సమస్య లేకుండా వాహనాలు రాకపోకలు సాగిస్తుండడంతో మార్కెట్ వ్యాపారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వ్యాపారుల ఫిర్యాదుల మేరకు ట్రాఫిక్ సమస్య పర్యవేక్షణకు పాండియన్, అముద సుగంధి బాలా, కామాక్షి నంగైయార్‌తో సహా మొత్తం ఐదుగురు అధికారులను నియమించారు. వీరు సోమవారం నుంచి శనివారం వరకు షిఫ్టుల్లో విధులు నిర్వహిస్తున్నారు.

కోవై వద్ద రైలు పట్టాలపై మగబిడ్డ శవం



పట్టాలపై మగబిడ్డ శవాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

చెన్నై, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): కోయంబత్తూరు సమీపం ఇరుక్కూరు వద్ద రైలు పట్టాలపై సోమవారం ఉదయం యేడాదిన్నర వయసున్న మగబిడ్డ శవం పడి ఉండగా స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు హుటాహుటిన అక్కడికి వెళ్లి పసిబిడ్డ మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టంకు తరలించారు. ఇదిలా ఉండగా రైలు పట్టాలపై పసిబిడ్డ శవం లభించిన చోట పసుపు, కుంకుమ, నిమ్మపండ్లు, కోడి రక్త మరకలు ఉండటంతో ఆ బిడ్డను నరబలి ఇచ్చేందుకు తీసుకువచ్చి ఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు. పోలీసు జాగిలంతో దుండగుల ఆచూకీకోసం పోలీసులు ముమ్మరంగా గాలిస్తున్నారు.

ఆలయ వేడుకల్లో మాజీ మంత్రి జయకుమార్

● చికెన్-65 తయారీ



చికెన్ వండుతున్న జయకుమార్

చెన్నై, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక మూలకొత్తలం వద్దనున్న అలంకార ముత్తుమారియమ్మన్ ఆలయ వేడుకల్లో మాజీ మంత్రి డి. జయకుమార్ చికెన్ వండి మహిళలను ఆకట్టుకున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో జయకుమార్ ఓడిపోయినప్పటికీ పార్టీ కార్యక్రమాలకు, రాయపురంలో పార్టీ శ్రేణులు జరిపే కార్యక్రమాలకు తప్పకుండా హాజరవుతుంటారు. ఇటీవల హాస్యనటుడు కింగ్‌కాంగ్ కుమార్తె వివాహ వేడుకలకు వెళ్లినప్పుడు మరుగుజ్జు అయిన కింగ్‌కాంగ్‌ను ఎత్తుకుని తిరుగుతూ సందడి చేశారు. ఆ కోవలోనే సోమవారం ఉదయం మూలకొత్తలం అలంకార మారియమ్మన్ ఆలయ వేడుకలు జరుగుతున్నట్లు తెలుసుకుని జయకుమార్ అమ్మవారి దర్శనానికి వెళ్ళారు. ఆలయ ప్రాంగణం లో వద్ద కొంతమంది మహిళలు కోడిమాంసం వండుతున్న చోటుకు వెళ్లి 'మీకు చికెన్-65' తినాలని ఉందా? అని అడిగారు. అందరూ చేయడం తెలియదని చెప్పగా, తానే చికెన్ -65 తయారు చేసి ఇస్తానంటూ తయారు చేశారు. పావుగంటలో ఆయన తయారు చేసిన చికెన్-65 మహిళలు రుచి చూసి చాలా బాగుందంటూ జయకుమార్‌ను మెచ్చుకున్నారు. ప్రస్తుతం జయకుమార్ చికెన్ తయారు చేస్తున్న వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.

రుతుపవనాలపై జీసీసీ ముందస్తు చర్యలు



రిప్పన్ భవనంలో సిద్ధం చేసిన మోటార్లతో కూడిన ట్రాక్టర్లు

పెరంబూర్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): రుతుపవన వర్షాల ముందస్తు చర్యలను గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ (జీసీసీ) వేగవంతం చేసింది. వాననీరు, మురుగు కాలువల్లో పూడికతీత పనులు పూర్తిచేయడంతో పాటు కాలువలకు ఇరువైపులా కంచె ఏర్పాటుచేసింది. అలాగే, కాలువల అడుగున కాంక్రీట్ వేసే పనులు కూడా జరుగుతున్నాయి. గత ఏడాది ఈశాన్య రుతుపవనాల కాలంలో సంభవించిన తుఫానులతో నగరం, శివారు ప్రాంతాలు ముంపునకు గురయ్యాయి. ముంపు ప్రాంతాల ప్రజలను రక్షించేలా, ఆయ ప్రాంతాల్లో చేరిన నీటిని సత్వరం తొలగించేలా జీసీసీ ముందస్తు చర్యలు చేపట్టింది. గతంలో ముంపు ప్రాంత వాసులను తరలించేందుకు ఏర్పాటుచేసిన పడవలు ఇప్పటికే అదే ప్రాంతాల్లో ఉన్నాయి. తాజాగా, ముంపు ప్రాంతాల్లో వరద నీటిని సత్వరం తొలగించేలా విద్యుత్ మోటార్లతో కూడిన ట్రాక్టర్లను జీసీసీ కార్యాలయం రిప్పన్ భవనంలో సిద్ధంగా ఉంచినట్లు అధికారులు తెలిపారు.

220 మంది విద్యార్థులు..79 నిమిషాల కర్రసాము



'ఐ లవ్ ఇండియా' నమూనాలో కర్రసాము చేస్తున్న విద్యార్థులు

పెరంబూర్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): కోయంబత్తూర్‌లోని ఓ ప్రైవేటు పాఠశాల విద్యార్థులు కర్రసాములో వినూత్న సాధన చేశారు. దేశం కోసం, కర్రసాము కళకు గౌరవం చేకూర్చేలా, 'ఐ లవ్ ఇండియా' అనే నమూనాలో 220 మంది విద్యార్థులు 79 నిమిషాలు ఒకటి, రెండు కర్రలు తిప్పుతూ ప్రదర్శించారు. విద్యార్థులు పాల్గొన్న ఈ కార్యక్రమాన్ని నోబెల్ ప్రపంచ రికార్డ్స్ పుస్తకంలో నమోదుచేసి సర్టిఫికెట్ అందజేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

కేవీ పాఠశాలలో వరల్డ్ గ్రాండ్ పేరెంట్స్ డే



కార్యక్రమంలో పాఠశాల నిర్వాహకులు

తిరుత్తణి సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా పళ్లిపట్టు కోరకుప్పంలోని కేవీ పాఠశాల ప్రాంగణంలో ఆదివారం ఉదయం వరల్డ్ గ్రాండ్ పేరెంట్స్ డే ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ గోమతి మాట్లాడుతూ, తల్లిదండ్రులు దేవుళ్లతో సమానమని, అలాంటి తల్లిదండ్రులకే జన్మనిచ్చిన గ్రాండ్‌పేరెంట్స్ అంతకన్నా గొప్పవారని, విద్యార్థులంతా పెద్దల పట్ల గౌరవభావాలు కలిగి వుండాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ నశ్రిన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రేషన్ కార్డుదారులకు మట్టికుండ పంపిణీ చేయాలి

● కుమ్మర్ల సంఘం డిమాండ్



మాట్లాడుతున్న ఎస్ఎం.నారాయణన్

ప్యారీస్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రేషన్ కార్డుదారులకు మట్టికుండ, మట్టిపొయ్యిలు పంపిణీ చేయాలని తమిళనాడు కుమ్మర్ల సంఘం రాష్ట్రప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. టినగర్ జీఎన్‌చెట్టి రోడ్డులోని సర్‌పిట్టి త్యాగరాయ ఆడిటోరియంలో సంఘ అధ్యక్షుడు ఎస్ఎం.నారాయణన్ అధ్యక్షతన రాష్ట్రస్థాయి కార్యవర్గ సమావేశం సోమవారం జరిగింది. ఇందులో 43 జిల్లాల అధ్యక్షులు, కార్యదర్శులు, రాష్ట్రస్థాయి నాయకులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో ఏకగ్రీవంగా ఆమోదించిన 13 అంశాల తీర్మానాల గురించి నారాయణన్ మాట్లాడుతూ, రుతుపవనాల సీజన్‌లో మట్టిపాత్రల తయారీ స్తంభిస్తున్న కారణంగా లక్షలాది మంది కార్మికులు ఉపాధి కోల్పోతున్నారని, దీనిపై ఆధారపడి ఉన్న కుటుంబాలకు రాష్ట్రప్రభుత్వం అందిస్తున్న రూ.5వేల ఆర్థికసాయాన్ని రూ.7వేలకు పెంచాలని విజ్ఞప్తి చేశారు. తమిళుల పెద్ద పండుగ సంక్రాంతి సందర్భంగా కుటుంబ కార్డుదారులకు పంపిణీ చేస్తున్న కిరాణా సరుకులతో పాటు మట్టికుండ, పొయ్యి పంపిణీ చేయాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. ఈ సమావేశంలో రాష్ట్ర కార్యవర్గ నిర్వాహకులు ఎం.గణపతి, మహేష్‌కన్నన్, ఎస్ఎన్ పళని, ఎన్.అన్బరసు, కె.ఆనందన్ పాల్గొన్నారు.

నవంబర్‌లో కొత్త పార్టీ

● అన్నాదురై జయంతి వేడుకల్లో మల్లైసత్య



పార్టీ జెండాను పరిచయం చేస్తున్న మల్లైసత్య

ప్యారీస్, సెప్టెంబరు 15 (ఆంధ్ర జ్యోతి): వచ్చే నవంబర్‌లో కొత్త పార్టీ ప్రారంభించనున్నట్లు ఎండీఎంకే బహిష్కృత నేత మల్లై సత్య ప్రకటించారు. దివంగత మాజీముఖ్యమంత్రి అన్నాదురై 117వ జయంతిని పురస్కరించుకుని ఆయన జన్మించిన కాంచీపురంలో సోమవారం మల్లైసత్య అధ్యక్షతన సమావేశం జరిగింది. వేదికపై అలంకరించిన అన్నాదురై చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ వేడుకల్లో నాంజిల్ సంపత్, ఇళయాపతి సహా రాజకీయ విశ్లేషకులు, పలువురు సీనియర్ నాయకులు పాల్గొన్నారు. అనంతరం వారి సమక్షంలో తాను కొత్తగా ప్రారంభించబోయే పార్టీ జెండాను మల్లైసత్య పరిచయం చేశారు. అయితే ఆయన ప్రారంభించనున్న కొత్త పార్టీ పేరు 'ద్రావిడ కుడయరసు విడుదలై కళగం' (డీకేవీకే)గా ఎంపిక చేసినట్లు విశ్వసనీయ సమాచారం.

సెంగోటయ్యన్, శశికళతో త్వరలో భేటీ

● మాజీ సీఎం ఓపీఎస్

అడయార్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): చిన్నాభిన్నమైన పార్టీ నేతలందరినీ ఏకతాటిపైకి తెచ్చేందుకు తన వంతు కృషి చేస్తానని, ఇందులో భాగంగా శశికళ, కేఏ సెంగోట్టయ్యన్‌లతో త్వరలోనే సమావేశమవుతానని మాజీ ముఖ్యమంత్రి ఓ.పన్నీర్‌సెల్వం వెల్లడించారు. ఇదే విషయంపై ఆయన సోమవారం మీడియాతో మాట్లాడుతూ, ఎంజీఆర్ స్థాపించిన అన్నాడీఎంకే ప్రయాణం ఎటు వెళ్తే మంచిగా ఉంటుందనేందుకు కొన్ని నిబంధనలున్నాయన్నారు. వీటినే దివంగత ఎంజీఆర్, జయలలిత పాటించారన్నారు. ప్రస్తుతం అన్నాడీఎంకే కట్టుబాట్లకు విఘాతం కలిగిందన్నారు. ఒక సాధారణ కార్యకర్త కూడా అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి కావచ్చుని, దానిని గాలికొదిలేశారన్నారు. ఈ విషయంపై తాను న్యాయపోరాటం చేశానని గుర్తు చేశారు. అదేసమయంలో పార్టీకి దూరమైన నేతలందరినీ ఒక్కటిగా చేర్చేందుకు పార్టీ సీనియర్ నేతలైన పార్టీ నుంచి బహిష్కరణకు గురైన శశికళ, కేఏ సెంగోట్టయన్‌లను త్వరలోనే కలిసి అన్ని విషయాలపై చర్చిస్తానని వెల్లడించారు.

జనం కోసమే సెలవు రోజుల్లో విజయ్ ప్రచారం

● మంత్రి రఘుపతి ఎద్దేవా

చెన్నై, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): తన పర్యటనలకు జనం అధిక సంఖ్యలో రావాలనే ఆలోచనతోనే తమిళగ వెట్రి కళగం నాయకుడు విజయ్ వారంతపు సెలవుదినాల్లో ప్రచారం చేస్తున్నారని రాష్ట్ర న్యాయశాఖ మంత్రి రఘుపతి విమర్శించారు. పుదుకోటలో సోమవారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ విజయ్ రాకవల్ల డీఎంకే ఓటు బ్యాంక్ ఏ మాత్రం తగ్గే అవకాశమే లేదన్నారు. విజయ్ పర్యటనల్లో ప్రభుత్వ ఆస్తులకు నష్టం జరుగుతోందని, పోలీసు నిబంధనలు ఉల్లంఘించి సభలు జరుపుతున్నారని, అందువల్లే పోలీసులు కేసులు నమోదుచేస్తున్నారని తెలిపారు. 2011లో డీఎంకేకు మద్దతుగా హాస్యనటుడు వడివేల్ ప్రచారం చేసినప్పుడు ప్రస్తుతం విజయ్ రోడ్‌షోల కంటే అధికసంఖ్యలో జనాలు వచ్చారని ఆయన చెప్పారు. శని, ఆదివారాలు స్కూళ్లు, కాలేజీలకు సెలవు కనుక యువకులను పెద్ద సంఖ్యలో సభకు వస్తారని భావించే విజయ్ ఆ రెండు రోజులు మాత్రమే ప్రచారం చేయడం గర్హనీయమని మంత్రి రఘుపతి అన్నారు.

గౌతం మేనన్ - దర్శన్ ప్రధాన పాత్రల్లో 'గాడ్జిల్లా'



'గాడ్జిల్లా' మూవీ పూజా దృశ్యం

జినిమా మీడియా ఎంటర్‌టైన్మెంట్ పతాకంపై నిర్మాత దినేష్ రాజ్, క్రియేటివ్ ఎంటర్‌టైనర్స్ అండ్ డిస్ట్రిబ్యూటర్స్ అధినేత, నిర్మాత ధనుంజయన్ సంయుక్తంగా ప్రముఖ దర్శకుడు గౌతం వాసుదేవ్ మేనన్, యువ హీరో దర్శన్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న 'గాడ్జిల్లా' చిత్రం పూజా కార్యక్రమం సోమవారం సాలిగ్రామంలోని ప్రసాద్ ల్యాబ్‌లో జరిగింది. ఈ కార్యక్రమానికి ప్రముఖ నిర్మాత కలైపులి ఎస్.థాను, దర్శకుడు శశి, ఫెప్సీ అధ్యక్షుడు, దర్శకుడు ఆర్‌కె సెల్వమణి, విజయ్, పాండిరాజ్ తదితరులు హాజరై చిత్ర బృందానికి శుభాకాంక్షలు తెలిపారు. మోహన్ గురు సెల్వ దర్శకత్వం వహించే ఈ చిత్రంలో అలీషా మీరా హీరోయిన్. ఈ సినిమా వివరాలను దర్శకుడు వివరిస్తూ, 'ఇది ఒక పౌరాణిక ఫాంటసీ, కామెడీ, రొమాన్స్ మిళితం చేసి రూపొందిస్తున్న చిత్రం. ప్రేమలో విఫలమైన యువకుడి జీవితంలోకి దైవీక శక్తి ప్రవేశించిన తర్వాత జరిగే సంఘటనల సమాహారం. నేటి జనరేషన్‌కు కనెక్ట్ అయ్యేలా, ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా రూపొందిస్తున్నాం. ఇతర పాత్రల్లో రోబో శంకర్, కేపీవై వినోద్, బ్లాక్ పాండి, పీజీఎస్ తదితరులు నటిస్తున్నారు. షూటింగ్ విశేషాలను త్వరలో వెల్లడిస్తాం' అని పేర్కొన్నారు. ఈ వేడుకలోనే యువ హీరో దర్శన్ పుట్టిన రోజు వేడుకలను కూడా నిర్వహించి, బర్త్‌డే కేక్ కట్ చేసి, దర్శన్‌కు బర్త్‌డే విషెస్ చెప్పారు.

కోలీవుడ్ ఛాన్సుల కోసం సంయుక్త ఎదురుచూపు

ధనుష్ నటించిన 'వాత్తి' సినిమాతో కోలీవుడ్ ప్రేక్షకులకు సంయుక్తా మేనన్ పరిచయమయ్యారు. ఆ తర్వాత ఆమె తమిళంలో ఒక్క చిత్రంలో కూడా నటించలేదు. కానీ, తెలుగు, హిందీ భాషల్లో మాత్రం వరుస చిత్రాల్లో నటించేందుకు ఒప్పందాలు కుదుర్చుకుంటున్నారు. ఆ కోవలో ఆమె చేతిలో తెలుగు, హిందీ భాషల్లో కలుపుకుని ఏకంగా ఎనిమిది చిత్రాలున్నాయి. కానీ, వీటిలో ఒక్క తమిళ చిత్రం కూడా లేకపోవడంతో ఆమె నిరుత్సాహానికి లోనవుతున్నారు. 'వాత్తి' సినిమాలో ఉపాధ్యాయురాలి పాత్రలో నటించి ప్రేక్షకులను మెప్పించిన సంయుక్తకు తమిళంలో ఎందుకు అవకాశాలు రావడం లేదని ఆమె అభిమానులు ప్రశ్నిస్తున్నారు. అయితే, ఆమె మాత్రం ఎప్పటికైనా తమిళంలో కూడా తనకు అవకాశాలు వస్తాయన్న ఆశతో ఎదురు చూస్తున్నారు.



చిత్రజ్యోతి

నిర్మాతల మండలి -పెఫ్సీ మధ్య కుదిరిన ఒప్పందం



నిర్మాత థాను సమక్షంలో మురళి, సెల్వమణి కరచాలన దృశ్యం

తమిళ సినీ నిర్మాతల మండలి, దక్షిణ భారత సినీ నిర్మాణ కార్మికుల సంఘ సమాఖ్య (పెఫ్సీ) నిర్వాహకులు ఒక అవగాహనకు వచ్చారు. న్యాయస్థానం, ముఖ్యమంత్రి స్టాలిన్ సూచన మేరకు ఇరు సంఘాల ప్రతినిధులు కూర్చొని అన్ని విషయాలను చర్చించుకుని అవగాహనకు వచ్చారు. ఈ విషయాన్ని సోమవారం సంయుక్తంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వెల్లడించారు. అంతేకాకుండా, ప్రముఖ నిర్మాత కలైపులి ఎస్.థాను సమక్షంలో నిర్మాతల మండలి అధ్యక్షుడు మురళి రామస్వామి, ఫెప్సీ అధ్యక్షుడు ఆర్.కె.సెల్వమణి కరచాలనం చేసుకున్నారు. ఈ సందర్భంగా వారు మీడియాతో మాట్లాడుతూ, కోర్టు ఆదేశాల మేరకు ఈ రాజీకి వచ్చారు. ప్రతి మూడేళ్ళకు ఒకసారి శాశ్వత ఒప్పందంపై చర్చలు జరిపాలని తాము నిర్ణయించాం. ముఖ్యంగా భవిష్యత్‌లో ఎలాంటి సమస్యలు లేకుండా ఇప్పటికే కుదుర్చుకున్న ఒప్పందాన్ని అమలు చేస్తామని వెల్లడించారు. అలాగే చిత్రపరిశ్రమ అభివృద్ధి, కార్మికుల ప్రయోజనాల పరిరక్షణ, నిర్మాతలకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా ఇరు వర్గాలు కలిసి ముందుకు సాగాలని నిర్ణయించినట్టు తెలిపారు. అదేసమయంలో చిత్రపరిశ్రమలో క్లిష్టపరిస్థితులు నెలకొన్నపుడు చిత్ర పరిశ్రమ ప్రయోజనాల కోసం ఇరు వర్గాలు తమ తమ ఆందోళన విరమించి సుహృద్భావత వాతావరణంలో చర్చలు జరిపేలా సంబంధిత శాఖామంత్రి, ప్రభుత్వ ఉన్నతాధికారులను ఆదేశించిన ముఖ్యమంత్రి స్టాలిన్, ఉప ముఖ్యమంత్రి ఉదయనిధిలకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

మనుగడ కోసమే హీరోలపై ద్వేషం

● హీరో ధనుష్




ఆడియో వేడుకలో ధనుష్, జీవీ ప్రకాష్

ఎవరో కొందరు ఒక బృందంగా ఏర్పడి, కొన్ని వందల ఫేక్ సోషల్ మీడియా ఐడీలు సృష్టించుకుని వారి మనుగడ కోసం హీరోలపై ద్వేషం వ్యక్తం చేస్తున్నారని హీరో ధనుష్ పేర్కొన్నారు. ఆయన స్వీయ దర్శకత్వంలో రూపొందిన 'ఇడ్లీకడై' చిత్రం ఆడియో రిలీజ్ నగరంలో ఆదివారం రాత్రి జరుగగా, ఆ చిత్ర బృందం మొత్తం హాజరైంది. ఇందులో ధనుష్ హీరోలపై సాగుతున్న ట్రోల్స్‌పై స్పందించారు. 'అసలు హేటర్స్ అనే కాన్సెప్టే లేదు. ఎందుకంటే ప్రతి ఒక్కరూ అందరు హీరోల చిత్రాలు చూస్తారు. ఎవరో కొందరు మాత్రం ఒక బృందంగా ఏర్పడి నకిలీ ఐడీలు సృష్టించి వారి మనుగడ కోసం కావాలనే హీరోలపై ద్వేషం వ్యక్తం చేస్తున్నారు. నా చిన్నతనంలో ఇడ్లీ తినేందుకు కూడా డబ్బులు ఉండేవి కాదు. ఇపుడు డబ్బులున్నాయి. కానీ, నా చిన్నతనంలో ఇడ్లీ రుచి ఇపుడు హైక్లాస్ రెస్టారెంట్లలో కూడా లేదు. 'ఇడ్లీకడై' నిజజీవితం ఆధారంగా తెరకెక్కింది. ఎంతో మందికి స్ఫూర్తినిస్తుందన్నారు. నటుడు పార్తిబన్ మాట్లాడుతూ, 'చిత్రపరిశ్రమలో ఇద్దరు ఎంపీలున్నారు. వారిలో ఒకరు కమల్ హాసన్. ఆయన రాజ్యసభలో ఎంపీ. మరో ఎంపీ ధనుష్. ఇక్కడ ఎంపీ అంటే మాస్టర్ పెర్ఫార్మెన్స్' అని పేర్కొన్నారు. నటుడు సత్యరాజ్ మాట్లాడుతూ, 'ధనుష్‌తో కలిసి నటించాలని ఎప్పటి నుంచో అనుకుంటున్నాను. అది ఈ చిత్రంతో నెరవేరిందన్నారు. సంగీత దర్శకుడు, హీరో జీవీ ప్రకాష్ మాట్లాడుతూ, 'ఈ చిత్రంలో హీరోకు ఉన్న నలుగురు స్నేహితుల్లో ఒక పాత్రలో నటించాలని ధనుష్ కోరారు. కానీ, ఆ పాత్ర హీరోకు ద్రోహం చేసే పాత్ర. అందుకే నిరాకరించాను. నిజజీవితంలోనే కాదు.. సినిమాలో ధనుష్‌కు ద్రోహం చేయను' అని అన్నారు. కాగా ధనుష్ దర్శకత్వం వహించి హీరోగా నటించిన ఈ చిత్రంలో నిత్యామేనన్, సత్యరాజ్, అరుణ్ విజయ్, షాలిని పాండే తదితరులు నటించారు. అక్టోబరు 1వ తేదీన తమిళం, తెలుగు భాషల్లో విడుదలకానుంది.

ఘనంగా అన్నాదురై జయంతి వేడుకలు

● రాష్ట్రవ్యాప్తంగా సంక్షేమ సహాయాల పంపిణీ
● నేతల ఘన నివాళి



అన్నాసాలైలో అన్నాదురై విగ్రహం వద్ద రాష్ట్రప్రభుత్వం తరుఫున నివాళులర్పిస్తున్న సీఎం స్టాలిన్, మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులు

ప్యారీస్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి అన్నాదురై 117వ జయంతి సందర్భంగా సోమవారం రాష్ట్రవ్యాప్తంగా రాజకీయ పార్టీలు ఘనంగా వేడుకలు నిర్వహించాయి. అన్నాదురై చిత్రపటానికి రాష్ట్ర ప్రభుత్వం తరపున ముఖ్యమంత్రి, మంత్రులు, ప్రధాన ప్రతిపక్ష నేత ఎడప్పాడి పళనిస్వామి సహా వివిధ రాజకీయపార్టీల నాయకులు నివాళులర్పించారు. డీఎంకే అధ్యక్షుడు, ముఖ్యమంత్రి స్టాలిన్ నుంగంబాక్కం వళ్లువర్‌కోట్టం సమీపంలో ఉన్న అన్నాదురై విగ్రహానికి ఉదయం 10 గంటలకు పూల మాల వేసి నివాళులర్పించారు. ఆయనతో పాటు డీఎంకే ప్రధాన కార్యదర్శి, మంత్రి దురైమురుగన్, డిప్యూటీ సీఎం ఉదయనిధి, ఎంపీలు టీఆర్ బాలు, ఎ.రాజా, రాష్ట్ర మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్‌శాఖ మంత్రి కేఎన్.నెహ్రూ, ఆరోగ్యశాఖ మంత్రి ఎం.సుబ్రమణ్యం, దేవాదాయ శాఖ మంత్రి పీకే.శేఖర్‌బాబు తదితరులు నివాళులర్పించారు. ఆ తర్వాత అన్నాసాలై జంక్షన్‌లో ఉన్న అన్నాదురై విగ్రహానికి రాష్ట్రప్రభుత్వం తరుఫున సమాచార శాఖ అధికారులు, తన మంత్రివర్గంతో కలిసి స్టాలిన్ నివాళులర్పించారు. అనంతరం తేనాంపేటలో డీఎంకే ప్రధాన కార్యాలయం అన్నా అరివాలయంలో అన్నా జయంతిని పండుగలా జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న పార్టీ నాయకులు, డీఎంకే జిల్లా కార్యదర్శులు, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, స్థానిక సంస్థల ప్రతినిధులతో స్టాలిన్ అన్నాదురై బాటలో పయనించి రాష్ట్రప్రజలకు మెరుగైన సేవలు చేయాలంటూ ప్రతిజ్ఞ చేయించారు.

అన్నాడీఎంకే ఆధ్వర్యంలో...

స్థానిక అన్నాసాలైలోని ఓమందూర్ రామస్వామి రెడ్డి ప్రభుత్వ ఎస్టేట్ సమీపంలోని అన్నాదురై విగ్రహానికి అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి పళనిస్వామి నేతృత్వంలో మాజీ మంత్రులు, పార్టీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయనతో పాటు పార్టీ ప్రిసీడియం చైర్మెన్ తమిళ్ మగన్‌హుసేన్, మాజీ మంత్రులు, సీనియర్ నేతలు కేపీ.మునిస్వామి, ఎస్పీ వేలుమణి, తంగమణి, ఓఎస్.మణియన్, వైగై సెల్వన్, దిండుగల్ శ్రీనివాసన్, పి.వలర్మతి, సీనియర్ నటి గౌతమి, మాజీఎంపీలు బాలగంగ, టీజీ.వెంకటేష్‌బాబు, జయవర్ధన్, ఎస్ఆర్.విజయ్‌కుమార్, మారిముత్తు, అన్నాడీఎంకే అనుబంధ విభాగాల నిర్వాహకులు, జిల్లా కార్యదర్శులు ఆర్ఎస్.రాజేష్, ఆదిరాజారామ్, ఎంజీఆర్ విభాగం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి డాక్టర్ వి.సునీల్ సహా ఎంపీలు, ఎమ్మెల్యేలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం రాయపేటలోని అన్నాడీఎంకే ప్రధాన కార్యాలయం సమీపంలో అన్నదాన, వస్త్రదాన కార్యక్రమాలు చేపట్టారు. అదేవిధంగా మాజీముఖ్యమంత్రి ఒ.పన్నీర్‌సెల్వం తమ మద్దతుదారులతో కలిసి అన్నాదురై విగ్రహానికి నివాళులర్పించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ, అన్నాడీఎంకే చట్ట నిబంధనలను గౌరవించి పార్టీ నుంచి తొలగించిన నాయకులందరినీ మళ్లీ చేర్చుకోకుండా నిర్లక్ష్యం చూపడం సరికాదన్నారు. అసమ్మతి వర్గానికి చెందిన సెంగోటయ్యన్‌తో తాను చర్చించనున్నట్లు తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఎవరితో పొత్తు అన్న నిర్ణయం తీసుకోలేదని ఓపీఎస్ తెలిపారు. ఈరోడ్ జిల్లా గోపిచెట్టిపాళయంలో అన్నాదురై జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి మాజీ మంత్రి సెంగోటయ్యన్ నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ, మాజీముఖ్యమంత్రులు ఎంజీఆర్, జయలలిత కృషితో కోట్లాది మంది కార్యకర్తలతో బలంగా ఉన్న అన్నాడీఎంకే నిర్వహిస్తున్న విధానం నచ్చకే తాను ఈ నెల 5న తన మనసులోని మాటను బయటపెట్టానని, అసెంబ్లీ ఎన్నికల్లో ఘన విజయం సాధించాలన్న లక్ష్యంతో పార్టీకి పూర్వవైభవం రావాలని ఆయన ఆకాంక్షించారు. రాష్ట్రంలోని ఎండీఎంకే, డీఎండీకే, డీపీఐ, పీఎంకే, కొంగుమక్కల్ కట్చి, ఏఎంఎంకే, న్యూజస్టిస్ పార్టీ, తదితర పార్టీల తరుఫున అన్నా జయంతి వేడుకలు ఘనంగా జరుపుకున్నారు.





అన్నాదురైకు నివాళులర్పిస్తున్న అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి, మాజీమంత్రులు - అన్నాదురైకు మాజీ సీఎం ఒ.పన్నీర్‌సెల్వం నివాళి

ఇళయరాజాకు రోజా అభినందనలు



కుటుంబీకులతో కలిసి ఇళయరాజాను అభినందిస్తున్న మాజీ మంత్రి రోజా

నింద్ర, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): సినీ సంగీత దర్శకుడు ఇళయరాజాను మాజీ మంత్రి రోజా అభినందించారు. 50 ఏళ్ల సంగీత ప్రస్థానాన్ని పూర్తి చేసుకున్న సందర్భంగా ఆయన్ను స్వగృహంలో సోమవారం తన కుటుంబీకులతో వెళ్లి సత్కరించి, అభినందనలు తెలిపారు. తమ చిత్రరంగ ప్రవేశం ఇళయరాజా సంగీతంతోనే ప్రారంభమైందని రోజా, సెల్వమణి దంపతులు గుర్తు చేసుకున్నారు. ఇళయరాజా గోల్డన్ హ్యాండ్ వల్లే తాము ఇంతగా ఎదిగామని సంతోషం వ్యక్తం చేశారు. రోజా కుమారుడు కృష్ణకౌశిక్‌ను ఈ సందర్భంగా ఇళయరాజా ఆశీర్వదించారు.

ఎంజీఆర్ కీర్తిని అపహరిస్తున్న విజయ్

● మాజీమంత్రి రాజేంద్ర బాలాజి



అన్నాదురై విగ్రహానికి నివాళులర్పిస్తున్న రాజేంద్ర బాలాజీ తదితరులు

ప్యారీస్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): సినీ, రాజకీయ రంగాల్లో దివంగత ముఖ్యమంత్రి ఎంజీఆర్ పొందిన ఖ్యాతిని కొత్తగా పార్టీని ప్రారంభించిన సినీ నటుడు విజయ్ అపహరించేందుకు ప్రయత్నిస్తున్నారని మాజీమంత్రి రాజేంద్రబాలాజీ ఆరోపించారు. విరుదునగర్ జిల్లా శివకాశిలో అన్నాదురై 117వ జయంతిని పురస్కరించుకుని సోమవారం ఆయన విగ్రహానికి రాజేంద్రబాలాజీ పార్టీ నాయకులతో కలిసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ, ఎంజీఆర్, జయలలిత అటు సినిమాల్లో, ఇటు రాజకీయాల్లో రాణించి చరిత్రలో నిలిచిపోయారని, ఇటీవల తమిళగ వెట్రి కళగం (టీవీకే) ప్రారంభించిన విజయ్ కూడా వారిలా రాణించాలనుకోవడం అసాధ్యమని, వారి ఫొటోలు చూపించి ప్రజలను తమవైపుకు మళ్లించాలనుకోవాలని చేస్తున్న ప్రయత్నాలు ఫలించవన్నారు. రాష్ట్రంలో డీఎంకే, అన్నాడీఎంకేలకు మాత్రమే అన్ని జిల్లా పార్టీ పరమైన బలమైన వ్యవస్థ ఉందని ఆయన పేర్కొన్నారు.

16వ వసంతంలోకి అన్నా శతజయంతి గ్రంథాలయం



అడయార్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక కోట్టూరుపురంలో 2010లో నిర్మించిన అన్నా శతజయంతి గ్రంథాలయం 16వ వసంతంలోకి ప్రవేశిస్తోంది. ఈ శుభ తరుణంలో రాష్ట్ర విద్యాశాఖామంత్రి అన్బిల్ మహేష్ సంతోషం వ్యక్తం చేశారు. ఇదే విషయంపై ఆయన మాట్లాడుతూ, దివంగత కలైంజర్ ప్రారంభించిన ఈ గ్రంథాలయాన్ని ఇప్పటివరకు 70.38 లక్షల మంది సందర్శించారన్నారు. కలైంజర్ బాటలోనే ప్రస్తుత ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ సారథ్యంలోని డీఎంకే ప్రభుత్వం కూడా రాష్ట్ర వ్యాప్తంగా గ్రంథాలయాలను నిర్మిస్తున్నారన్నారు.

విజయ్ రాకతో పార్టీల ఓటు బ్యాంకుకు గండి

● ఎంపీ కార్తి చిదంబరం



పాఠశాల తరగతి గదులకు శంకుస్థాపన చేస్తున్న ఎంపీ కార్తి చిదంబరం

ప్యారీస్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): తమిళగ వెట్రి కళగం (టీవీకే)స్థాపించి రాజకీయాల్లోకి విజయ్ రావడం వల్ల అన్ని పార్టీల ఓటు బ్యాంకుకు గండిపడే ప్రమాదముందని కాంగ్రెస్ ఎంపీ కార్తి చిదంబరం అభిప్రాయపడ్డారు. శివగంగ జిల్లా మానామదురై సమీపంలోని కట్టికుళం ప్రాంతంలో తన పార్లమెంట్ నియోజకవర్గ అభివృద్ధి నిధుల నుండి కేటాయించిన రూ.53.57 లక్షలతో ప్రభుత్వ మహోన్నత పాఠశాలలో అదనపు తరగతి గదులకు ఆదివారం శంకుస్థాపన జరిగింది. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ, విజయ్ రోడ్‌షోలకు జనం పెద్దసంఖ్యలో హాజరుకావడం చూస్తున్నామని అయితే రాబోయే రోజుల్లో వచ్చిన జనం అంతా ఓటు బ్యాంకుగా మారుతుందా? అనేది వేచిచూడాల్సివుందన్నారు.

జోస్ అలుక్కాస్ 'టర్మరిక్ సిటీ' ఎగ్జిబిషన్



'టర్మరిక్ సిటీ' ఎగ్జిబిషన్ ప్రారంభం

అడయార్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): దేశంలో నాణ్యత, నూతన అవిష్కరణలు, న్యూ డిజైన్ల తయారీలో పేరెన్నికగన్న జోస్ అలుక్కాస్ సంస్థ ఈరోడ్‌లోని ఆర్‌కేవీ రోడ్డులో 'టర్మరిక్ సిటీ' పేరుతో సిగ్నేచర్ జ్యూవెలరీ ఎగ్జిబిషన్ ఏర్పాటు చేసింది. ఈ నెల 13 నుంచి ప్రారంభమైన ఈ ఎగ్జిబిషన్ అక్టోబరు 5వ తేదీ వరకు కొనసాగనుంది. ఇదే విషయంపై జోస్ అలుక్కాస్ గ్రూపు మేనేజింగ్ డైరెక్టర్ పాల్ జె.అలుక్కాస్ మాట్లాడుతూ, ఈ ఎగ్జిబిషన్ అద్భుతమైన హస్తకళకు ప్రతీకగా ఉంటుందన్నారు. తమ కొనుగోలుదారులు ఇంతకుముందెన్నడూ చూడని బంగారు ఆభరణాల డిజైన్లను చూడొచ్చన్నారు. సంప్రదాయానికి ప్రతీకగా ఉండేలా తాము డిజైన్లను తయారు చేస్తున్నామని వెల్లడించారు. ఇది కేవలం ఒక ఎగ్జిబిషన్ మాత్రమే కాదని, ప్రపంచ స్థాయి నైపుణ్యంతో తయారు చేసిన బంగారు ఆభరణాల కళాత్మక ప్రదర్శన అని పేర్కొన్నారు.

ఎన్డీయే కూటమిలోనే ఉన్నా!

● టీఎంసీ అధ్యక్షుడు జీకే.వాసన్



సమావేశంలో మాట్లాడుతున్న జీకే. వాసన్

ప్యారీస్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే కూటమిలోనే ఉన్నామని తమిళ మానిల కాంగ్రెస్ (టీఎంసీ) అధ్యక్షుడు, కేంద్రమాజీ మంత్రి జీకే.వాసన్ స్పష్టం చేశారు. 2026లో జరగనున్న అసెంబ్లీ ఎన్నికలను పురస్కరించుకుని మైలాపూర్ సీఐటీ కాలనీలో ఆదివారం టీఎంసీ ఆధ్వర్యంలో బూత్ కమిటీ ఇన్‌ఛార్జులు, పార్టీ ప్రచారకర్తల సమావేశం జీకే.వాసన్ అధ్యక్షతన జరిగింది. సభలో ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో బీజేపీ, టీఎంసీ, పురచ్చి భారతం, అన్నాడీఎకే తదితర పార్టీలతో ఏర్పడిన ఎన్డీయే కూటమిలో ఎలాంటి విభేదాలు లేవని, అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శ ఎడప్పాడి పళనిస్వామి కూటమిని విజయం వైపు తీసుకెళ్తున్నారన్నారు. టీఎంసీలో యువజన, విద్యార్థి విభాగాలు, పార్టీ అనుబంధ సంస్థలు ఇప్పటినుంచే ఎన్నికలపై దృష్టిసారించి అన్ని జిల్లాల్లో సభలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఇందులో మాజీ ఎమ్మెల్యేలు విడియల్ శేఖర్, జయచంద్రన్, ప్రధాన కార్యదర్శులు వి.జవహర్ బాబు, జీఆర్.వెంకటేష్, రాణి కృష్ణన్, జిల్లా అధ్యక్షుడు ఈకే.అరుణ్‌కుమార్, బిజిచాకో, పి.కల్యాణి సహా బూత్ కమిటీల నిర్వాహకులు, పార్టీ ప్రచారకర్తల పాల్గొన్నారు.

రాష్ట్ర వ్యాప్తంగా సంక్షేమ కార్యక్రమాలు

● సత్యసాయి సేవా సంస్థ వెల్లడి



కరపత్రాన్ని విడుదల చేస్తున్న సత్యసాయి సంస్థ నిర్వాహకులు

అడయార్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): సత్యసాయి బాబా శతజయంతి వేడుకలను పురస్కరించుకుని తమిళనాడు విభాగం రాష్ట్ర వ్యాప్తంగా వివిధ సేవా కార్యక్రమాలను నిర్వహించనుంది. 'అందరినీ ప్రేమించు - అందరికీ సేవ చేయు' అనే నినాదంతో ఈ కార్యక్రమాలను నిర్వహించనున్నట్టు తమిళనాడు విభాగం నిర్వాహకులు తాజాగా విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శ్రీ సత్యసాయి సేవా సంస్థలు ఆధ్యాత్మిక, విద్య, ప్రజాసేవ అనే మూడు అంశాలతో పనిచేస్తున్నాయని తమిళనాడు విభాగం అధ్యక్షుడు ఎస్.ఆర్.చంద్రశేఖరన్ వెల్లడించారు. ఇదే విషయంపై ఆయన మాట్లాడుతూ, సత్యసాయి బాబా శతాబ్ది ఉత్సవాలు ఒక జ్ఞాపకార్థంగా కాకుండా, ఆయన సార్వత్రిక ప్రేమ, సేవ, దైవీక సందేశాల ప్రచారం తదితర అంశాలతో నిర్వహించనున్నట్టు వెల్లడించారు.

తిరుమల చేరుకున్న గవర్నర్ నజీర్



తిరుమల, సెప్టెంబరు15 (ఆంధ్రజ్యోతి): గవర్నర్ అబ్దుల్ నజీర్ సోమవారం సాయంత్రం తిరుమలకు వచ్చారు. విధాత నిలయం(రచన)కు చేరుకున్న ఆయనకు టీటీడీ ఈవో అనిల్‌కుమార్ సింఘాల్ పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికారు. అనంతరం పోలీసు సిబ్బంది గవర్నర్‌కు గౌరవ వందనం సమర్పించారు. రిసెప్షన్ అధికారులు బస, దర్శన ఏర్పాట్లు చేశారు. వెంగమాంబ అన్నప్రసాద భవనానికి వెళ్లిన ఆయన భక్తులతో కలిసి అన్నప్రసాదాలు స్వీకరించారు. మంగళవారం ఉదయం శ్రీవారిని దర్శించుకోనున్నారు.

టీటీడీకి ఎలక్ట్రిక్ వ్యాన్ విరాళం

తిరుమల, సెప్టెంబరు15(ఆంధ్రజ్యోతి): టీటీడీకి సోమవారం ఓ ఎలక్ట్రిక్ వ్యాన్ విరాళంగా అందింది. బెంగళూరుకు చెందిన టీవోల్ట్ ఎలక్ట్రిక్ వెహికల్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ రూ.15.94 లక్షల విలువైన మొంట్రా ఎలక్ట్రిక్ ఏవియేటర్(ఈ-ఎస్‌సీవీ) వాహనాన్ని అందజేసింది. ఈమేరకు సోమవారం ఉదయం శ్రీవారి ఆలయం ముందు వాహనానికి ప్రత్యేక పూజలు నిర్వహించి సంస్థ ప్రతినిధులు తాళాలను శ్రీవారి ఆలయ డిప్యూటీఈవో లోకనాథానికి అందజేశారు.



శ్రీవారి సర్వదర్శనానికి 10 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 10 గంటల సమయం పడుతోంది. సోమవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్-2లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలో మూడు షెడ్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్-1లో 4 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

- శనివారం హుండీ ఆదాయం: రూ.3.53 కోట్లు
- ఆదివారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 77,893
- తలనీలాలు సమర్పించినవారు: 24,604



గ్యాలరీల్లో 1.85 లక్షల మంది

- వాహన సేవలు వీక్షించే అవకాశం
- తప్పుడు ప్రచారానికి కౌంటర్ చేసేందుకు ప్రత్యేక టీమ్‌లు
- టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి



తిరుమల, సెప్టెంబరు15(ఆంధ్రజ్యోతి): తిరుమలలో 24 నుంచి జరగనున్న శ్రీవారి బ్రహ్మోత్సవాలకు పటిష్ఠ ఏర్పాట్లు చేస్తున్నామని టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి తెలిపారు. మాడవీధుల్లోని గ్యాలరీల్లో 1.85 లక్షల మంది భక్తులు కూర్చుని వాహన సేవలను వీక్షించే అవకాశముందన్నారు. రీఫిల్లింగ్ ద్వారా మరో 15 వేల మందికి కూడా వాహనసేవల దర్శనం లభిస్తుందన్నారు. తిరుమలలోని అన్నమయ్య భవనంలో ఎస్పీ సుబ్బరాయుడు, విజిలెన్స్ సీవీఎస్వో మురళీకృష్ణ, ఇతర అధికారులతో సోమవారం ఆయన సమన్వయ సమావేశం నిర్వహించారు. భక్తుల భద్రత, రవాణా, పార్కింగ్, క్రౌడ్ మేనేజ్మెంట్ వంటి అంశాలపై విస్తృతంగా చర్చించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. భక్తుల సౌకర్యార్థం ఆర్టీసీ ద్వారా రోజుకు 435 బస్సులు నడుస్తున్నాయని, దీని ద్వారా రోజుకు సుమారు 1.60 లక్షల మంది భక్తులు పికప్, డ్రాప్ సౌకర్యం కల్పించవచ్చన్నారు. ట్రాఫిక్ సమస్యను తగ్గించేలా వీలైంతన వరకు భక్తులు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించాలని కోరారు. తిరుపతిలో 23 పార్కింగ్ ప్రదేశాలను సిద్ధం చేస్తున్నట్టు వెల్లడించారు. గ్యాలరీల్లోకి చేరుకునే భక్తులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా ఏర్పాట్లు చేశామన్నారు. 4,200 మంది పోలీసులు, 1,500 మంది విజిలెన్స్ సిబ్బందితో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశామన్నారు. కమాండ్ కంట్రోల్ సిస్టమ్ ద్వారా క్రౌడ్ మూవ్‌మెంట్, రద్దీ పాయింట్లను రియల్ టైం మానిటరింగ్ చేసేందుకు చర్యలు తీసుకున్నట్టు చెప్పారు. సీఎం, రాజ్యాంగపరమైన అధినేతలు, వీఐపీల రాకపోకలకు ప్రత్యేక ఎంట్రీ, ఎగ్జిట్ ప్లాన్ సిద్ధం చేస్తున్నట్టు వివరించారు. సోషల్ మీడియాలో తప్పుదారి పట్టించే ప్రచారాన్ని వెంటనే కౌంటర్ చేసేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ రామకృష్ణ, డీఎస్పీలు, వీఎస్వోలు, సీఐలు తదితరులు పాల్గొన్నారు.

అక్టోబరు 16 నుంచి ఎస్వీయూలో యువ తరంగ్

పోస్టర్లు ఆవిష్కరించిన వీసీ, రిజిస్ట్రార్, శాప్ చైర్మన్



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న వీసీ అప్పారావు, శాప్ చైర్మన్ రవినాయుడు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఎస్వీ యూనివర్సిటీ స్టూడెంట్ వెల్ఫేర్ అండ్ కల్చరల్ అఫైర్స్ విభాగం ఆధ్వర్యంలో అక్టోబరు 16వ తేదీ నుంచి యువతరంగ్-2025 నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన పోస్టర్లను సోమవారం ఎస్వీయూలో వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు, శాప్ చైర్మన్ రవినాయుడు ఆవిష్కరించారు. వీసీ మాట్లాడుతూ అక్టోబరు 16 నుంచి యూనివర్సిటీ వేదికగా మూడు రోజులు డిగ్రీ, పీజీ కాలేజీల విద్యార్థులకు అంతర యూనివర్సిటీల సాంస్కృతిక పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. వక్తృత్వ, సంగీత, నృత్య, థియేటర్ ఆర్ట్స్ వంటి 10 అంశాల్లో పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. రిజిస్ట్రార్ మాట్లాడుతూ యువ తరంగ్‌లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని యూనివర్సిటీ సాంస్కృతిక ఔన్నత్యాన్ని పెంపొందించ డానికి ప్రయత్నించాలన్నారు. శాప్ చైర్మన్ అనిమిని రవినాయుడు మాట్లాడుతూ యూనివర్సిటీ క్రీడా, సాంస్కృతిక రంగాల్లో అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తానని చెప్పారు. స్టూడెంట్ వెల్ఫేర్ డైరెక్టర్ బీవీ మురళీధర్, కల్చరల్ అఫైర్స్ కో-ఆర్డినేటర్ డాక్టర్ పత్తిపాటి వివేక్ చౌదరి మాట్లాడుతూ 40డిగ్రీ, పీజీ కాలేజీల విద్యార్థులు యువ తరంగ్‌లో పాల్గొంటున్నట్టు చెప్పారు. ప్రిన్సిపాళ్లు వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు, పద్మావతి, మీడియా డీన్ పీసీ వేంకటేశ్వర్లు, ఎన్ఎస్ఎస్ కో కో-ఆర్డినేటర్ డాక్టర్ పాకనాటి హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అమ్మా.. మీ వేషాలు నా దగ్గర కాదు!

- సైబర్ నేరగాళ్ల ఉచ్చుకు చిక్కని శానిటేషన్ వర్కర్

తిరుపతి(నేరవిభాగం), సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఎంత చదువుకున్నా.. ఎంత పరిజ్ఞానమున్నా సైబర్ నేరగాళ్ల మాయమాటలు నమ్మేవాళ్లే ఎక్కువ. వాళ్ల ఉచ్చులోపడి లబోదిబోమనే వాళ్లే. కానీ, తిరుపతికి చెందిన శానిటేషన్ వర్కర్ ఒకరు మాత్రం మీ వేషాలు నా దగ్గర కాదంటూ సోమవారం తనకు ఫోనుచేసిన అమ్మాయికి దీటుగా ఎదురు తిరిగారు. వివరాలిలా ఉన్నాయి. తిరుపతికి చెందిన దొరరాజు మధుసూదనరాజు టీటీడీ పరిధిలోని వైద్య ఆరోగ్య శాఖలో కాంట్రాక్టు ప్రాతిపదికన శానిటేషన్ వర్కర్‌గా పనిచేస్తున్నారు. ఈయనకు 87459 85232 నెంబరు నుంచి వాట్సాప్ ఫోను వచ్చింది. వాట్సాప్ పిక్‌గా 'స్కాలర్‌షిప్ డిపార్టుమెంటు' అని ఉంది. మీ కుమారుడు రోహిత్ కుమార్ రాజుకు ప్రభుత్వం స్కాలర్ షిప్ కింద రూ.38,500 మంజూరు చేసిందంటూ ఓ యువతి చెప్పింది. మీకు ఫోనుపే ద్వారా జమ చేశామంటూ స్క్రీన్ షాట్ పెట్టింది. స్క్రీన్ షాట్‌లో ఆ మొత్తం జమ చేసినట్లుగా ఉంది. దీనికిగాను తమకు కమీషను కింద వెంటనే డబ్బు పంపాలని తొందర చేసింది. నీ అకౌంటులో రూ.మూడు వేలు ఉంది కదా.. దానిని పంపండని ఆమె ఒత్తిడి తెచ్చింది. ఈయన మాత్రం తన తన అకౌంటులో బ్యాలెన్సు చెక్ చేయగా, జమ కాలేదని తెలిసింది. మీరు డబ్బు పంపండి.. మళ్ళీ స్కాలర్ షిప్ అమౌంటుతో కలిపి మీకు పంపుతామంటూ ఆమె చెప్పినా ఆయన గట్టిగా నిలదీశారు. దీంతో ఆమె ఫోను స్విచ్ ఆఫ్ చేసింది. ఇలాంటి ఫోన్ కాల్స్ విషయంలో అప్రమత్తంగా ఉండాలని సైబర్ క్రైం సీఐ వినోద్‌కుమార్ విజ్ఞప్తి చేశారు.

అవగాహనతో ప్రాణాంతక వ్యాధుల నిర్మూలన



తిరుపతి(వైద్యం), సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): ప్రాణాంతక వ్యాధులపై అవగాహన ఉన్నప్పుడే పూర్తిగా నిర్మూలించే అవకాశం ఉంటుందని డీఎంహెచ్‌వో బాలకృష్ణనాయక్ అన్నారు. జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టీబీ కార్యాలయం ఆధ్వర్యంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయ ఆవరణలో ఆయన సోమవారం మొబైల్ ఐఈసీ ప్రచార రథాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఎయిడ్స్ లెప్రసీ, టీబీ వ్యాధులపై క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించేందుకు ఈ వాహనం ఉపయోగపడుతుందన్నారు. అనంతరం ఎయిడ్స్, లెప్రసీ, టీబీ వ్యాధులకు సంబంధించిన ప్రచార పుస్తకాలు, పత్రికలను ఆవిష్కరించారు. వైద్యాధికారులు శైలజ, కోటిరెడ్డి, సురేంద్ర, మంజునాథ్, పుల్లయ్య పాల్గొన్నారు.

ప్రాధాన్యతతోనే సాధికారత సాకారం

- మహిళా ప్రజాప్రతినిధుల వాణి

తిరుపతి(కలెక్టరేట్), సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): దేశాభివృద్ధిలో మహిళల భాగస్వామ్యం ముఖ్యం..ఆర్థికంగా, సామాజికంగా వారికి సమాన హక్కులు కల్పిస్తే ఇది సాధ్యం.. దేశ గమనాన్ని నిర్దేశించే రాజకీయాల్లో భూమిక మరింత పెరగాలి. అప్పుడే భారతావనిలో మహిళా సాధికారత సాకారమవుతుంది. తిరుపతిలో రెండోరోజు(సోమవారం) జరిగిన జాతీయ మహిళా సాధికారత సమావేశంలో పాల్గొన్న పలువురు మహిళా ప్రజాప్రతినిధులు వ్యక్తం చేసిన అభిప్రాయాలివి..వారేమన్నారంటే...



గవర్నర్ అబ్దుల్ నజీర్‌తో మహిళా ప్రజాప్రతినిధులు

అన్ని రంగాల్లో ప్రాధాన్యత కల్పించాలి



రాజకీయంగానే కాకుండా ఇతర రంగాల్లోనూ మహిళలకు రాష్ట్ర ప్రభుత్వాలు, ప్రైవేటు సంస్థలు ప్రాధాన్యత కల్పించాలి. ప్రస్తుతం మైనార్టీ మహిళలు కూడా మరింతమంది రాజకీయాల్లోకి రావడం శుభపరిమానం. ఆ దిశగా వారు ముందుకు రావడం అభినందనీయం. ప్రధానమంత్రి మోదీ, సీఎం చంద్రబాబు మహిళలకు అగ్రాసనమేస్తున్నారు. ఇలాంటి సదస్సులు మహిళలు మరింత ముందుకు సాగడానికి ప్రేరణనిస్తాయి.

- జకియాఖానం, ఏపీ శాసనమండలి డిప్యూటీ చైర్‌పర్సన్

తీర్మానాలు అమలైతేనే సార్థకత



జాతీయ సాధికారత సదస్సులో మహిళాభ్యున్నతికి చేసిన తీర్మానాలను చట్టసభలో కూడా ఆమోదించాలి. వాటిని అమలు చేయాలన్నారు. అపుడే వాటికి సార్థకత లభిస్తుంది. పంచాయతీ నుంచి అసెంబ్లీ వరకు మహిళకు రాజకీయాల్లో సమాన ప్రాతినిధ్యం కల్పించాలి. ఆడబిడ్డల భవిష్యత్తుకు ప్రభుత్వాలు మరన్ని చట్టాలు తెవాల్సి ఉంది. ఈ శతాబ్దంలో కూడా మహిళలు తమ సమస్యలపై పోరాడాల్సి వస్తోంది.

- తారహై కుత్‌బ్రెట్, ఎమ్మెల్యే, తమిళనాడు

సదస్సు చరిత్రలో ఓ మైలురాయి



మహిళాభివృద్ధికి తొలిసారిగా జాతీయ మహిళ సాధికారత సదస్సు నిర్వహించడం శుభపరిణామం. ఇది చరిత్రలో ఓ మైలురాయిలా నిలుస్తుంది. కేరళలో మహిళా అభివృద్ధికి అక్కడి ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలు చేపట్టింది. పురుషులతో పోలిస్తే మహిళ అక్షరాస్యత శాతం కూడాఎక్కువే. మహిళలు మరింత ఎదగాలంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చిత్తశుద్ధితో చర్యలు తీసుకోవాలి.

- ప్రతిభ, మహిళసాధికారత చైర్‌పర్సన్,కేరళ

మరిన్ని పథకాలు అవసరం



మహిళల రక్షణ, స్వావలంబనకు కేంద్ర రాష్ట్రప్రభుత్వాలు మరిన్ని పథకాలు తేవాలి. విద్యా,ఆర్థిక, నైపుణ్యాభివృద్ధితోనే మహిళా సాధికారత కల సాఫల్యమవుతుంది. చిన్నప్పటి నుంచి విద్య అందించడం, లింగ వివక్షత రూపుమాపడం, సమాన అవకాశాలు కల్పించడం ద్వారా రాజకీయ సామాజిక రంగాల్లో మహిళలు రాణించడానికి వీలవుతుంది. కేరళలో మహిళలు కూడా వందశాతం అక్షరాస్యత సాధించారు.

- శాంతకుమారి, కోంగడ్ ఎమ్మెల్యే, కేరళ

మహిళా ఎమ్మెల్యేల సంఖ్యే సాధికారతకు దర్పణం

మహిళలను ఒక శక్తిగా చూడాలన్నది సీఎం చంద్రబాబునాయుడు సంకల్పం. దేశంలో ఎక్కడా లేని విధంగా ఏపీలో 22మంది మహిళా ఎమ్మెల్యేలు అసెంబ్లీలో ఉండటం చంద్రబాబు దార్శనికతకు దర్పణం. ఆర్థికంగా, రాజకీయంగా మహిళలు ఎదిగితేనే సాధికారత సాకారమవుతుంది. ఈ దిశగానే రాష్ట్రంలో అన్ని రంగాల్లో మహిళలకు కూటమి ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తోంది.

- మిరియాల శిరీషాదేవి, రంపచోడవరం ఎమ్మెల్యే



సదస్సుతో సాధికారతకు బాట



తొలిజాతీయ మహిళా సాధికారత సదస్సు తిరుపతి కేంద్రంగా నిర్వహించడం గర్వకారణంగా ఉంది. ఈ సదస్సులో చేసిన తీర్మానాలు మహిళాలోకానికి ఎంతగానో ఉపయోపడతాయి. మహిళలకు అధికారం, ఆర్థికంగా ఎదగడానికి సదస్సు బాటలు వేస్తుంది. సదస్సు నిర్వహించిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ధన్యవాదాలు.

- ఎ.మధుసూదన్, ఎమ్మెల్సీ

సూపర్‌సిక్స్‌లో నాలుగు స్త్రీలకే..



మహిళ సాధికారతను కూటమి ప్రభుత్వం ఆచరణ సాధ్యం చేస్తోంది. సీఎం చంద్రబాబు ఈ విషయంలో నిబద్ధతతో పనిచేస్తున్నారు. అందుకు పథకాల్లో మహిళలకే పెద్ద పీట వేస్తున్నారు. సూపర్‌సిక్స్‌లో నాలుగు పథకాలు మహిళలకే కేటాయించిన ఘనత చంద్రబాబుకు దక్కింది. సదస్సుకు రాష్ట్ర ప్రభుత్వం ఆతిథ్యం ఇవ్వడం సంతోషం.

- గౌతు శిరీష, పలాస ఎమ్మెల్యే







సదస్సు గురుతులు : సదస్సుకు హాజరైన డెలిగేట్ల సెల్ఫీ - ఫొటో తీసుకుంటూ - శ్రీకాళహస్తీశ్వరాలయంలో మహిళా ప్రజాప్రతినిధులు



శ్రీవారి ఆలయంలో నవీన్‌చంద్ర రాంగులామ్ దంపతులతో మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో సింఘాల్ తదితరులు

కృతజ్ఞతలు తెలపడానికి వచ్చా

- సిద్ధేశ్వర తీర్థ ఆశ్రమానికి మారిషస్ ప్రధాని నవీన్‌చంద్ర



మారిషస్ ప్రధాని నవీన్‌చంద్రకు బొట్టు పెడుతున్న గురువానంద

రామచంద్రాపురం,సెప్టెంబరు15(ఆంధ్రజ్యోతి): 'సిద్ధేశ్వర తీర్థ ఆశ్రమ పీఠాధిపతి గురవానంద గురూజీ ఆశీర్వాదంతోనే నేను నాలుగోసారి మారిషస్ ప్రధానినయ్యా. అందుకు కృతజ్ఞతలు తెలపడానికి ఆశ్రమానికి వచ్చా' నని నవీన్‌చంద్ర రాంగులామ్ చెప్పారు రామచంద్రాపురం మండలం సి.రామాపురం సమీపంలోని బ్రహ్మర్షి గురూజీ సిద్ధేశ్వర తీర్థ ఆశ్రమాన్ని సోమవారం మారిషస్ ప్రధానమంత్రి నవీన్‌చంద్ర రామ్‌గులాం, వీణా రామ్‌గులాం దంపతులు సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతేడాది సెప్టెంబరు 15న మారిషస్‌లో తాను గురువానంద గురూజీని కలవగా, నవంబరు 13లోపు ప్రధానమంత్రి అవుతావని చెప్పారన్నారు. ఆ ప్రకారం కావడంతో ఆశ్రమానికి వచ్చి ఆయన్ను కలిశానని తెలిపారు. నవీనచంద్ర చేపట్టిన ప్రజాసేవకు గుర్తింపుగా ఇప్పటికే నాలుగు పర్యాయాలు మారిషస్ ప్రధానమంత్రి అయ్యారని గురువానంద గురూజీ తెలిపారు. రాష్ట్ర దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, తిరుపతి ఎంపీ గురుమూర్తి, తెలంగాన రాజ్యసభ సభ్యుడు రవిచంద్రారెడ్డి, చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని, తుడా చైర్మన్ దివాకర్‌రెడ్డి, రాష్ట్ర హస్తకళల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్ తదితరులున్నారు. అనంతరం మారిషస్ ప్రధాని దంపతులు శ్రీవారి దర్శనార్థం తిరుమలకు బయలుదేరగా జేసీ శుభం బన్సల్, ఆర్డీవో రామ్మోహన్, డీఎస్పీ ప్రసాద్, ఆశ్రమ నిర్వాహకులు రాజేష్, శాంతిలాల్, సరళ, ఆనీస్‌మెహతా తదితరులు వీడ్కోలు పలికారు. అనంతరం నవీన్‌చంద్ర దంపతులు తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు.

అడవిలో మృతదేహాలపై వీడని మిస్టరీ

హత్య కోణంలోనూ అనుమానాలు ● రెండు గోతుల్లో ఏముందో తేలేది రేపే





మృతదేహాలను పరిశీలిస్తున్న పోలీసు, రెవెన్యూ అధికారులు

పాకాల, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): పనపాకం రిజర్వు ఫారెస్ట్ పరిధిలో ఇద్దరి వ్యక్తుల మృతదేహాల గుర్తింపులో చిక్కుముడి వీడలేదు. ఇక్కడి అడవిలో రెండు మృతదేహాలను ఆదివారం సాయంత్రం గొర్రెల కాపరులు గుర్తించి పోలీసులకు సమాచారమిచ్చిన విషయం తెలిసిందే. సీఐ సుదర్శన్ ప్రసాద్, తహసీల్దార్ సంతోష్ సాయి, సిబ్బంది సోమవారం వెళ్లి పరిశీలించారు. చెట్టుకు వేలాడుతున్న పురుషుడి మృతదేహాన్ని కిందికి దించారు. దీనితోపాటు అక్కడే కిందఉన్న మహిళ మృతదేహానికి సాయంత్రం వైద్యులు అక్కడే పోస్టుమార్టం చేశారు. ఇవి కుళ్లిపోయి గుర్తుపట్టలేని స్థితిలో ఉండటతో అక్కడే ఖననం చేశారు. ఫోరెన్సిక్ క్లూస్ టీమ్ పరిసరాల్లో ఆనవాళ్లు సేకరించింది. కాగా పక్కనే రెండు గోతుల్లో చిన్నారుల మృతదేహాలు ఉన్నాయని భావిస్తున్నారు. గుంతలు తవ్వేందుకు ప్రయత్నించేలోగానే చీకటి పడింది. మంగళవారం తవ్వి పరిశీలించనున్నారు. మృతులు తమిళనాడు తంజావూరుకు చెందిన వారుగా భావిస్తున్నారు. తంజావూరుకు చెందిన కలైసెల్వన్ అనే మానసిక వైద్యుని వద్ద మేలో చికిత్స తీసుకున్న ప్రిస్క్రిప్షన్ సంఘటనా స్థలంఒ లభించింది. అంతకుమించి ఎలాంటి ఆనవాళ్లు లభించలేదని పోలీసులు తెలిపారు. మహిళ, పురుషుడి నోట్లో గుడ్డలు, గ్లౌజులు కుక్కి, నోటికి ప్లాస్టర్ వేసి ఉంది. ఎక్కడో హత్య చేసి ఇక్కడకు తీసుకొచ్చి చెట్టుకు ఉరివేశారా, ఇక్కడే చంపేశారా అనేది మిస్టరీగా ఉంది. పోలీసుల దర్యాప్తులో పూర్తి వివరాలు తెలియాల్సి వుంది.

'ఎర్ర' స్మగ్లర్ అరెస్టు : 21 దుంగలు స్వాధీనం



మంగళం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): తిరుపతి టీఎస్‌పాళెం అటవీ ప్రాంతంలో సోమవారం టాస్క్‌ఫోర్సు పోలీసులు ఒక స్మగ్లర్‌ను అరెస్టు చేశారు. 21 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. ఆర్ఐ సాయి గిరిధర్ ఆధ్వర్యంలో విష్ణుకుమార్ బృందం అటవీ సిబ్బంది చైతన్యకిషోర్‌తో కలిసి కూంబింగ్ నిర్వహించారు. టీఎస్‌పాళెం సమీపంలోని షాపింగ్‌మాల్ వెనుక వైపు కొందరు మూడు కార్లలో దుంగలు లోడ్‌చేస్తుండగా వెళ్లారు. వీరిని చూసి వారు చూసి పారిపోగా.. వెంబడించి ఒకరిని పట్టుకున్నారు. అతడు చిత్తూరు జిల్లాకు చెందిన వాడిగా గుర్తించారు. 19 వేర్లు, రెండు దుంగలను, స్మగ్లర్‌ను టాస్క్‌ఫోర్సు పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఎస్ఐ రఫీ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.